


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 270 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ ) ప్రచురణ : విశాఖపట్నం శుక్రవారం 6 జూన్ 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 270 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM FRI 6 JUNE 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Prakasam, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur

## వాళ్లు చిన్న పిల్లకాయలా... మరి నువ్వు కూడా చిన్నపిల్లాడివేనా జగన్ రెడ్డీ?



- జగన్‌పై ఆనం వెంకటరమణారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజం
- గంజాయి, రేప్ కేసుల నిందితులను చిన్నపిల్లలనడంపై మండిపాటు
- చంద్రబాబును విమర్శించే అర్హత జగన్‌కు లేదన్న ఆనం
- 31 కేసుల్లో వాయిదాలు తీసుకుంటున్నారని జగన్‌పై ఆరోపణ
- లీగల్ ఫీజుల కోసమే రూ.6,904 కోట్లు ఖర్చు చేశారని విమర్శ
- కేసులు తేల్చుకున్నాకే టీడీపీ గురించి మాట్లాడాలని హితవు

హైదరాబాద్ పెన్ పవర్:మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఏపీ స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ

వివరాలు 2లో..

## గత సీఎం హెలికాప్టర్ లో వెళుతుంటే కింద ఉన్న చెట్లు ఎగిరిపోయేవి

- నిన్న ప్రపంచ పర్యావరణ దినోత్సవం
- అనంతవరంలో మొక్కలు నాటిన సీఎం చంద్రబాబు
- గత ప్రభుత్వంలో పర్యావరణ పరిరక్షణ నిర్లక్ష్యానికి గురైందని ఆరోపణ




హైదరాబాద్ పెన్ పవర్:గత వైసీపీ ప్రభుత్వం చెట్లను నరికివేయడమే పనిగా పెట్టుకుందని, వారికి చెట్ల వల్ల కలిగే ప్రయోజనాలపై కనీస అవగాహన లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శించారు. చెట్లను పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, వాటిని నరికివేయడం దుర్మార్గమని ఆయన అన్నారు. రాష్ట్రంలో పచ్చదనాన్ని గణనీయంగా పెంచేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఇవాళ రాజధాని ప్రాంతంలోని అనంతవరంలో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, గత ప్రభుత్వ హయాంలో పర్యావరణ పరిరక్షణను పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. గత ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో ప్రయాణిస్తుంటే కింద ఉన్న చెట్లు ఎగిరిపోయేవని సెటైర్ వేశారు. కానీ ఇప్పుడు తాను, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటిస్తున్నప్పుడు ఒక్క చెట్టు కూడా నరకడం లేదని ప్రజలు గమనించాలని కోరారు.

కొన్ని దేశాల్లో చెట్లను నరికితే శాశ్వతంగా జైల్లో పెడతారని, చెట్టు నరకాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అని చంద్రబాబు గుర్తుచేశారు. చెట్టు నరికితే మనిషిని చంపినంత నేరంగా పరిగణించి చర్యలు తీసుకునే పరిస్థితులు ఉన్నాయని అన్నారు. "చెట్లు పెంచడం మనందరి బాధ్యత. చెట్లు నరకడం అత్యంత దుర్మార్గమైన చర్య" అని ఆయన పేర్కొన్నారు. అందరం ఆక్సిజన్ తీసుకుంటున్నాం కదా... మరి మొక్కలు నాటే బాధ్యత లేదా?రానున్న నాలుగైదు సంవత్సరాల్లో రాష్ట్రంలో కనీసం 37 శాతం పచ్చదనం ఉండేలా చూడాలన్నది తమ లక్ష్యమని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇందుకోసం ఉద్యానవన పంటల (హార్టికల్చర్) అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని, ఈ విషయంలో పవన్ కల్యాణ్ కూడా స్పష్టమైన సూచనలు చేశారని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో కనీసం పది మొక్కలు నాటి పెంచాలని పిలుపునిచ్చారు. "అందరం ఆక్సిజన్ తీసుకుంటున్నాం కదా? మరి మొక్కలు నాటే బాధ్యత మనపై లేదా?" అని ప్రజలను ప్రశ్నించారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన రావాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు.ప్రపంచం ఎదుర్కొంటున్న పెను సవాళ్లలో గ్లోబల్ వార్మింగ్ ఒకటని, దీనివల్ల ఉష్ణోగ్రతలు పెరిగి వర్షాలు తగ్గిపోతున్నాయని, భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. దీని ప్రభావంతో సాగు ప్రమాదంలో పడుతోందని, తాగునీటికి ఇబ్బందులు తలెత్తి ఫ్లోరైడ్

సమస్యలు పెరిగి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన చెందారు. చిన్నప్పుడు చదువుకున్న కథను గుర్తుచేస్తూ, "ఒక వృద్ధుడు తన తర్వాతి తరాల కోసం చెట్టు నాటినట్లు, మనం కూడా భవిష్యత్ తరాల కోసం చెట్లు నాటాలి. స్వార్థంతో బతకడం కాదు, విజ్ఞతతో ప్రవర్తించాలి," అని హితవు పలికారు. పద్మశ్రీ వనజీవి రామయ్య వంటి వ్యక్తులు మనకు ఆదర్శమని, వారి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు.



## సచివాలయంలో సొమ్మసిల్లి పడిపోయిన మంత్రి కొండా సురేఖ

- తెలంగాణ సచివాలయంలో మంత్రి కొండా సురేఖకు స్వల్ప అస్వస్థత
- ఉదయం నుంచి ఆహారం తీసుకోకపోవడంతో కళ్లు తిరిగి పడిపోయిన మంత్రి
- వెంటనే ఆహారం అందించడంతో కోలుకున్న కొండా సురేఖ
- మంత్రిని పరామర్శించిన సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గురువారం నాడు అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. కేబినెట్ సమావేశానికి హాజరయ్యేందుకు వచ్చిన ఆమె, సమావేశం ప్రారంభానికి ముందే కళ్లు తిరిగి పడిపోయారు. ఈ ఘటనతో సచివాలయ సిబ్బంది, అధికారులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు.

వివరాల్లోకి వెళితే, మంత్రి కొండా సురేఖ ఉదయం నుంచి ఎలాంటి ఆహారం తీసుకోలేదని తెలిసింది. ఈ కారణంగానే ఆమె అస్వస్థతకు లోనై, సచివాలయంలోని తన ఛాంబర్ వద్దకు వెళుతుండగా సొమ్మసిల్లి పడిపోయినట్లు సమాచారం. మంత్రికి షుగర్ లెవెల్స్ పెరిగాయని తెలిసింది. వెంటనే అప్రమత్తమైన మంత్రి వ్యక్తిగత సిబ్బంది ఆమెకు ప్రథమ చికిత్స అందించి, ఆహారం అందజేశారు. కాసేపటికి కొండా సురేఖ తేరుకున్నారు.

ఈరోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర కేబినెట్ సమావేశం జరగాల్సి ఉంది. ఈ సమావేశంలో పాల్గొనేందుకు మంత్రులందరూ సచివాలయానికి చేరుకున్నారు. మంత్రి కొండా సురేఖ అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు వెంటనే ఆమె వద్దకు వెళ్లి పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

## బెంగళూరు తొక్కిసలాట ఘటన.. మీడియా ముందు కన్నీళ్లు పెట్టుకున్న డిప్యూటీ సీఎం డీకే శివకుమార్



- బెంగళూరులో ఆర్సీబీ ఐపీఎల్ గెలుపు సంబరాల్లో ఘోర విషాదం
- ఘటనలో 11 మంది మృతి
- మీడియా ముందు కన్నీటి పర్యంతమైన డిప్యూటీ సీఎం డీకే శివకుమార్
- మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ప్రకటన
- దుర్ఘటనపై 15 రోజుల్లో నివేదిక ఇవ్వాలని విచారణకు ఆదేశం
- డీకే శివకుమార్ నిర్లక్ష్యమే కారణమంటూ ప్రతిపక్షాల విమర్శలు

వివరాలు 2లో..

## ఆసుపత్రిలో చేరిన మాగంటి గోపీనాథ్.. ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరం!




- బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు తీవ్ర అస్వస్థత, ఆసుపత్రిలో చికిత్స
- గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి హుటాహుటిన తరలింపు
- గుండె సంబంధిత సమస్యగా గుర్తించి చికిత్స అందిస్తున్న వైద్యులు
- ఐసీయూలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపిన హరీశ్ రావు

హైదరాబాద్ పెన్ పవర్:జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఆయనకు చికిత్స అందిస్తున్నారు. మాగంటి గోపీనాథ్ గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నట్లు సమాచారం. ఏఐజీ ఆసుపత్రి వైద్యులు ఆయనకు వైద్య

వివరాలు 2లో..

## బహుశా ఆయనకు ఉన్నంత అర్హత నాకు లేదేమో!



- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం
- అమరావతిలోని అనంతవరంలో కార్యక్రమం
- సీఎం చంద్రబాబుతో పాటు హాజరైన పవన్ కల్యాణ్
- పర్యావరణ పరిరక్షణే ధ్యేయమని ఉద్ఘాటన
- వచ్చే ఏడాదిలోగా కోటి మొక్కలు నాటుతానని ప్రతిజ్ఞ

హైదరాబాద్ పెన్ పవర్:ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నేడు అమరావతి ప్రాంతంలోని అనంతవరంలో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఉద్వేగభరితంగా ప్రసంగించారు. పర్యావరణ పరిరక్షణకు తన

వివరాలు 2లో..

## ఐరాసలో పాక్‌కు కీలక పదవులు... ఖర్గే సహా కాంగ్రెస్ నేతలు తీవ్ర అభ్యంతరం



- ఐరాసలో పాక్‌కు ఉగ్రవాద నిరోధక పదవులపై కాంగ్రెస్ ఫైర్
- ఇది దురదృష్టకరం, ఆమోదయోగ్యం కాదన్న ఖర్గే
- పాక్‌ను మళ్లీ ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) గ్రే లిస్ట్‌లో చేర్చాలని డిమాండ్

హైదరాబాద్ పెన్ పవర్:ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు అండగా నిలవండని ప్రపంచానికి పిలుపు

పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందని, అలాంటి దేశానికి ఐక్యరాజ్యసమితి (ఐరాస) భద్రతా మండలి ఉగ్రవాద నిరోధక కమిటీలో కీలక బాధ్యతలు అప్పగించడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ నేత పవన్ ఖేడా ఈ పరిణామాలపై తీవ్రంగా స్పందించారు. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా భారత్ చేస్తున్న ఉగ్రవాద పోరాటానికి ప్రపంచ దేశాలు మద్దతు ఇవ్వాలని వారు కోరారు.

మల్లికార్జున ఖర్గే గురువారం 'ఎక్స్' వేదికగా ఈ అంశంపై సుదీర్ఘమైన పోస్టు చేశారు. పాకిస్థాన్‌కు ఇటీవల లభించిన ఆర్థిక సహాయ ప్యాకేజీలు, రుణాలను ఆ దేశం తన సైన్యంపైనా, భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడంపైనా ఖర్చు చేస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఉగ్రవాదాన్ని పోషించే పాకిస్థాన్‌ను, ఉగ్రవాద బాధితురాలైన భారత్‌తో పోల్చడం సరికాదని ఖర్గే అన్నారు.

వివరాలు 2లో..

## బెంగళూరు తొక్కిసలాట: కర్ణాటక ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

- ఆర్సీబీ విజయోత్సవాల్లో 11 మంది మృతి, 30 మందికి పైగా గాయాలు
- బెంగళూరు తొక్కిసలాట ఘటనపై కర్ణాటక హైకోర్టు సుమోటో విచారణ
- రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిన ఉన్నత న్యాయస్థానం
- తదుపరి విచారణను జూన్ 10వ తేదీకి వాయిదా



హైదరాబాద్ పెన్ పవర్:రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఐపీఎల్ విజయోత్సవాల సందర్భంగా చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ దుర్ఘటనకు సంబంధించి కర్ణాటక ప్రభుత్వానికి రాష్ట్ర హైకోర్టు గురువారం నోటీసులు జారీ చేసింది. ఈ విషయాన్ని సుమోటోగా విచారణకు స్వీకరించిన న్యాయస్థానం, ప్రభుత్వ తీరుపై ఆరా తీసింది. అడ్వకేట్ జనరల్ సమర్పించిన స్టేటస్ రిపోర్ట్‌ను పరిగణనలోకి తీసుకున్నామని హైకోర్టు ధర్మాసనం వెల్లడించింది. "మేము మా అభిప్రాయాలను అడ్వకేట్ జనరల్‌కు తెలియజేశాం. ఆయన దాఖలు చేసిన స్టేటస్ రిపోర్ట్‌ను రికార్డులోకి తీసుకున్నాం. ఈ సుమోటో కేసును రిట్ పిటిషన్‌గా నమోదు చేయాలని రిజిస్ట్రీని ఆదేశిస్తున్నాం" అని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ కేసు తదుపరి విచారణను జూన్ 10వ తేదీ మంగళవారానికి వాయిదా వేసింది.

చిన్నస్వామి స్టేడియం వద్ద వేలాది మంది అభిమానులు గుమికూడటంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ దురదృష్టకర ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోగా, 30 మందికి పైగా గాయపడ్డారు. ఘటన అనంతరం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మృతుల కుటుంబాలకు తక్షణమే రూ.10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి ఉచితంగా వైద్య సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా, ఈ ఘటనపై మేజిస్టీరియల్

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# పవన్ ఇమేజ్ పెరిగిందా? తగ్గిందా? తూకం ఎటు వైపు ఉందంటే?

జనసేన అధినేతగా జనంలోకి వచ్చి అధికారాన్నిచేపట్టిన పవన్ కల్యాణ్ ఆంధ్రప్రదేశ్ లో ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఈరోజుకు గత ఏడాది ఎన్నికల ఫలితాలు వచ్చాయి. జనసేనకు హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేటు వచ్చింది. ఇరవై ఒక్క అసెంబ్లీ స్థానాల్లోనూ, రెండు పార్లమెంటు స్థానాల్లో పోటీ చేసిన అభ్యర్థులు అందరూ గెలిచారు. దాదాపు పదిహేడు శాతం ఓటు బ్యాంకును కూడా సొంతం చేసుకుంది. తర్వాత చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలను చేపట్టారు. కీలకమైన గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖతో పాటు తనకు అత్యంత ఇష్టమైన అటవీ శాఖను అడిగి మరీ తీసుకున్నారు. తనతో పాటు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ కు కేబినెట్ లో అవకాశం కల్పించారు.

**తనకు కేటాయించిన...**

తొలిసారి మంత్రి పదవి తీసుకోవడంతో కొన్ని రోజుల పాటు తనకు అప్పగించిన శాఖలపై పవన్ కల్యాణ్ పూర్తి స్థాయి అధ్యయనం చేశారు. కేరళలో ఉన్న ఏపీకి చెందిన ఐఏఎస్ అధికారి కృష్ణతేజ్ ను తన టీంలోకి తెచ్చుకుని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ఫోకస్ పెట్టారు. గ్రామాల్లో రహదారులు, మంచినీటి సమస్యలను ప్రధానంగా తొలగించేందుకు ఒకింత పవన్ కల్యాణ్ చేసిన ప్రయత్నాలు ఫలించాయని చెప్పాలి. పంచాయతీలకు నిధులు విడుదల చేయించడంలో పవన్ కల్యాణ్ సక్సెస్ అయ్యారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులను నిర్మించి అటవీ పుత్రులకు అండగా తాను ఉన్నానన్న భరోసాను పవన్ కల్యాణ్ ఇవ్వగలిగారు. ఇక ఏనుగుల దాడి నుంచి పంటలను రక్షించేందుకు కర్ణాటక నుంచి కుకీ ఏనుగులను తెప్పించడంలో కీలకంగా వ్యవహరించారు.

**మౌనంగా ఉండటం...**

ఇక ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో పవన్ కల్యాణ్ కొన్ని నిర్ణయాల పట్ల మౌనంగా ఉండటం, ప్రభుత్వాన్ని ప్రశ్నించలేకపోవడం ఒకింత ఆయన ఇమేజ్ ను డ్యామేజీ చేస్తుందనే చెప్పాలి. పవన్ కల్యాణ్ గతంలో ఎన్నడూ అధికారంలో లేకపోవడం, తాను పవర్ లోకి వస్తే ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై ప్రశ్నించే వారు ఎక్కువయ్యారు. ప్రశ్నించడానికే రాజకీయాల్లోకి వచ్చినట్లు తనకు తాను ప్రకటించుకున్న పవన్ కల్యాణ్ ప్రశ్నల గురించి మానేశారు. ఆయన ప్రభుత్వ నిర్ణయాలకు తలూపటమే ఇప్పుడు విమర్శలకు తావిస్తుంది. అమరావతి రాజధాని నిర్మాణానికి ఇస్తున్న ప్రాధాన్యత సమస్యల పరిష్కారానికి పాటుపడకపోవడంపై పవన్ మౌనాన్ని సోషల్ మీడియాలో చాలా మంది తప్పుపడుతున్నారు.

**ప్రభుత్వంలో ఉండి...**

నిజానికి ప్రభుత్వంలో ఉండి బహిరంగంగా విమర్శించడానికి అవకాశం లేదు. అంతర్గత సమావేశాల్లోనే తనకున్న అభ్యంతరాలను తెలియజేయాల్సి ఉంటుంది. చంద్రబాబు కేబినెట్ లో ఉప ముఖ్యమంత్రిగా ఉండి బహిరంగంగా విమర్శలు చేస్తే అది ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తుంది. ఎవరైనా ఇలాగేనే చేస్తారు. కానీ పవన్ కల్యాణ్ అంతర్గత సమావేశాల్లోనూ తలూపి రావడం వల్లనే ఈ విమర్శలు ఎక్కువయ్యాయని అంటున్నారు. ఆయన గత ఎన్నికల సందర్భంగా మాట్లాడిన మాటలు, ఇచ్చిన హామీలను ట్రోల్ చేస్తూ వైసీపీ నేతలు పవన్ కల్యాణ్ వెంట పడుతున్నారు. మొత్తం మీద పవన్ కల్యాణ్ నిజాయితీగా ఉన్నప్పటికీ, తన శాఖల విషయంలో మంచి పురోగతి సాధించినప్పటికీ ప్రశ్నించడం మానేసి ప్రజల్లో చులకనయ్యారంటున్నారు.

# వాళ్లు చిన్న పిల్లకాయలా... మరి నువ్వు కూడా చిన్నపిల్లాడివేనా జగన్ రెడ్డీ?

- మొదటి పేజీ తరువాయి

చైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి, వైసీపీ అధినేత జగన్ పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గంజాయి, పోలీసులపై హత్యాయత్నం, మహిళలపై అత్యాచారాలు వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారిని జగన్ 'చిన్న పిల్లకాయలు'గా అభివర్ణించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. "గంజాయి, హత్యాయత్నాలు, రేపులు చేసేవారు చిన్న పిల్లకాయలైతే, మరి నువ్వు కూడా చిన్నపిల్లవాడివేనా జగన్ రెడ్డీ?" అని ఆనం సూటిగా ప్రశ్నించారు.

చంద్రబాబు గురించి మాట్లాడేటప్పుడు సంయమనం పాటించాలని హితవు పలికిన ఆనం, "మా అధినేతను నడిరోడ్డుపై కొట్టాలన్న నిన్ను దేనితో కొట్టాలి? 31 కేసులు పెట్టుకుని, విచారణకు హాజరుకాకుండా వాయిదాలతో తప్పించుకు తిరుగుతున్న నిన్ను చెప్పుతో కొట్టాలా?" అంటూ తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. జగన్ ఓటమిపాలై సంవత్సరం గడిచినా ఆయన ప్రవర్తనలో మార్పు రాలేదని, ఎవరితో ఎవరిని పోల్చాలో కూడా తెలియడం లేదని ఎద్దేవా చేశారు. తన హయాంలోనే కొందరిపై కేసులు నమోదు చేసి, ఇప్పుడు వారిని పరామర్శించడానికి తెనాలి వెళ్లినప్పుడు ప్రజలు "సీఎం సీఎం" అనడానికి బదులు "ఛీఎమ్ ఛీఎమ్" అన్నారని, ఇది జగన్‌కు సిగ్గుచేటని అన్నారు.

వైసీపీ కార్యకర్తలకు జగన్ ఎలాంటి విలువలు నేర్పుతున్నారని ఆనం ప్రశ్నించారు. "రేపులు చేయండి, దొంగతనాలు చేయండి, పోలీసులపై హత్యాయత్నాలు చేయండి, మీరు జైలుకు వెళితే నేను వచ్చి పరామర్శిస్తా అని చెబుతున్నారా?" అని నిలదీశారు. సంఘ విద్రోహ చర్యలకు పాల్పడుతూ పోలీసులపై విమర్శలు చేయడం సరికాదన్నారు. అంబటి రాంబాబు పోలీసులను చూసి పళ్లు కొరకడంపై స్పందిస్తూ, "పళ్లు ఊడగొడతారు జాగ్రత్త" అని హెచ్చరించారు. చంద్రబాబును రోడ్డుపై కొట్టాలన్న వ్యాఖ్యలకు జగన్ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

జగన్‌పై కేసులు నమోదై 5000 రోజులు గడిచిందని, దమ్ముంటే కోర్టుకు వెళ్లి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకున్న తర్వాతే చంద్రబాబు గురించి మాట్లాడాలని ఆనం సవాల్ విసిరారు. 3,452 సార్లు కోర్టు వాయిదాలు తీసుకోవడం ప్రపంచ రికార్డని, లీగల్ ఫీజుల కోసమే జగన్ రూ.6,904 కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. "రోజుకు కోటి 39 లక్షలు ఖర్చుపెట్టి జైలుకు పోకుండా బయట ఉంటున్నావు. నీ కేసులు తేల్చుకునే దమ్ము లేదు కానీ, మా నాయకుల గురించి మాట్లాడతావా?" అని ప్రశ్నించారు. ఆరు నెలల్లో తన కేసుల విచారణ పూర్తి చేయమని కోర్టును అడిగే ధైర్యం జగన్‌కు ఉందా అని నిలదీశారు.

# ఏపీ పోలీసుల ఏఐ హ్యాకథాన్... డీటెయిల్స్ ఇవిగో!

**గుంటూరులో ఈ నెల 27 నుండి 29 వరకు ఏఐ హ్యాకథాన్**

**27న ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభం**

**ఏఐ హ్యాకథాన్‌లో యువ ఇంజినీర్లకు భాగస్వామ్యం**

**పోలీసింగ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వంటి అంశాలను వివరించిన గుంటూరుకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థులు**

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలో కృత్రిమ మేధస్సు సాంకేతికతతో పోలీసింగ్‌లో నాణ్యతను మెరుగుపరచేందుకు చర్యలు తీసుకుంటోంది. ఈ నెల 27 నుండి 29 వరకు గుంటూరులో ఏఐ హ్యాకథాన్ నిర్వహించనుంది.

ఈ కార్యక్రమాన్ని 27వ తేదీన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గుంటూరులోని ఆర్.వి.ఆర్ అండ్ జె.సి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకువెళ్లడంలో యువతరం తమదైన చొరవ చూపనుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పోలీస్ శాఖ సమన్వయంతో నిర్వహించే ఏఐ హ్యాకథాన్‌లో యువ ఇంజినీర్లకు భాగస్వామ్యం కల్పించారు.

దీంతో యువ ఇంజినీర్లు ఇందుకు సంబంధించి వర్క్‌ను ప్రారంభించారు. కార్యక్రమ నిర్వహణలో వారి పాత్ర, కృత్రిమ మేధ ఉపయోగాలు, పోలీసింగ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వంటి అంశాలపై గుంటూరుకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులు వివరించారు.

# చంద్రబాబు బూట్లు తుడుస్తానన్న కొడాలి నాని ఎక్కడ?..

- గుడివాడ ప్రజలకు కొడాలి వెన్నుపోటు పొడిచారన్న ఎమ్మెల్యే
- మంత్రిగా అధికారాన్ని అడ్డుపెట్టుకుని అవినీతికి పాల్పడ్డారని విమర్శ
- ఇంకా నీచ రాజకీయాలు చేస్తున్నారని మండిపాటు
- వైసీపీ నేతలు రోడ్లపై డ్రామాలు ఆడుతున్నారని ఆగ్రహం
- గుడివాడ అభివృద్ధిని అడ్డుకుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరిక

**హైదరాబాద్ పెన్ పవర్:** గుడివాడలో తాను ఓడి, కుప్పంలో చంద్రబాబు విజయం సాధిస్తే రాజకీయాల నుంచి తప్పుకోవడమే కాకుండా.. చంద్రబాబు బూట్లు శుభ్రం చేస్తానని గతంలో సవాల్ విసిరిన మాజీ మంత్రి కొడాలి నాని ఏడాది కాలంగా ఎక్కడ దాక్కున్నారని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రశ్నించారు. నిన్న గుడివాడ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొడాలి నాని గుడివాడ ప్రజలకు వెన్నుపోటు పొడిచారని, దానికి ఆయన సమాధానం చెప్పాలని నిలదీశారు. మంత్రిగా ఉన్న సమయంలో నాని అధికారాన్ని దుర్వినియోగం చేసి అవినీతి ద్వారా భారీగా సొమ్ము కూడబెట్టుకున్నారని ఎమ్మెల్యే రాము ఆరోపించారు. చేసిన తప్పులకు సిగ్గుపడి, పశ్చాత్తాపం చెందాల్సింది పోయి ఇంకా నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. గుడివాడ నియోజకవర్గంలో వైసీపీ నాయకులు సాగించిన అరాచకాలు, దుర్మార్గాలకు గత సంవత్సరం ఇదే రోజున ప్రజలు తమ ఓటు ద్వారా సరైన తీర్పు ఇచ్చారని, దానికి సిగ్గుతో తలదించుకోవాల్సింది పోయి 'వెన్నుపోటు దినం' అంటూ రోడ్ల మీదకు రావడం దారుణమన్నారు.

గడిచిన 20 ఏళ్లుగా గుడివాడ శాసనసభ్యుడిగా కొడాలి నాని అవలంబించిన మోసపూరిత, వెన్నుపోటు రాజకీయాలకు ఆయన జవాబు చెప్పగలరా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. గతంలో ప్రభుత్వ వ్యవస్థలను పూర్తిగా నిర్వీర్యం చేసి, అధికారాన్ని తమ చేతుల్లోకి తీసుకుని ఇప్పుడు రోడ్లెక్కి నాటకాలు ఆడితే ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. గుడివాడ నియోజకవర్గంలో తలపెట్టిన అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవాలని ప్రయత్నిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

కడపలో జరిగిన మహానాడుకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి, గుడివాడలో తాను సాధించిన విజయానికి అభినందనలు తెలియజేశారని, ఇది తనకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు.

# ఐరాసలో పాక్‌కు కీలక పదవులు... ఖర్గే సహా కాంగ్రెస్ నేతలు తీవ్ర అభ్యంతరం

- మొదటి పేజీ తరువాయి

ఐరాస భద్రతా మండలి ఉగ్రవాద నిరోధక కమిటీకి పాకిస్థాన్‌ను వైస్ చైర్మన్‌గా నియమించడం, అలాగే 2025 సంవత్సరానికి గాను తాలిబన్ ఆంక్షల కమిటీకి అధ్యక్ష బాధ్యతలు అప్పగించడాన్ని ఖర్గే తీవ్రంగా తప్పుపట్టారు. "ఇది పూర్తిగా దురదృష్టకరం, అవగాహన రాహిత్యంతో కూడుకున్నది, ఏమాత్రం ఆమోదయోగ్యం కానిది" అని పేర్కొన్నారు. ఉగ్రవాదులకు ఆర్థిక సహాయం అందకుండా నిఘా పెట్టేందుకు పాకిస్థాన్‌ను మళ్లీ ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) గ్రే లిస్ట్‌లో చేర్చాలన్న భారత్ డిమాండ్‌లోని సహేతుకతను ప్రపంచ దేశాలు గుర్తించాలని ఖర్గే కోరారు. ఇది కేవలం భారత్ కోసమే కాదని, అంతర్జాతీయ సమాజం ప్రయోజనాల కోసం కూడా అవసరమని ఆయన స్పష్టం చేశారు. మోస్ట్ వాంటెడ్ ఉ

ఉగ్రవాది ఒసామా బిన్ లాడెన్ పాకిస్థాన్‌లోనే హతమయ్యాడన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

అంతకుముందు, ఇదే అంశంపై కాంగ్రెస్ నేత పవన్ ఖేడా కూడా స్పందించారు. ఉగ్రవాద నిరోధక కమిటీకి పాకిస్థాన్ నాయకత్వం వహించడాన్ని ఆయన తప్పుపట్టారు. "జూన్ 4వ తేదీన తాలిబన్ ఆంక్షల కమిటీకి పాకిస్థాన్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైంది. ఇది మన విదేశాంగ విధానంలో ఒక విషాదగాథ. అసలు ప్రపంచ దేశాలు దీనికి ఎలా అనుమతించాయి?" అని ఆయన సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేశారు.

# బహుశా ఆయనకు ఉన్నంత అర్హత నాకు లేదేమో!

- మొదటి పేజీ తరువాయి

వంతు కృషిగా వచ్చే ఏడాది ఇదే రోజు నాటికి రాష్ట్రంలో కనీసం కోటి మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నానని ఆయన ప్రకటించారు. అడవుల్లో కార్చిచ్చులను నివారించడం, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచడం వంటి కార్యక్రమాలను చేపడతామని తెలిపారు.

ఈ సందర్భంగా పర్యావరణవేత్త కుమెర అంకారావు సేవలను పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. "14 ఏళ్ల వయసులో ప్లాస్టిక్ వ్యర్థాలు తిని ఒక పక్షి చనిపోవడం చూసి చలించిపోయి, మూడు దశాబ్దాలుగా పర్యావరణ పరిరక్షణకు అంకితమైన కుమెర అంకారావు గారి నిబద్ధత ప్రశంసనీయం. ఆయనకున్నంత అర్హత బహుశా నాకు లేదేమో అనిపిస్తుంది" అంటూ పవన్ వినమ్రంగా వ్యాఖ్యానించారు. నల్లమల అడవుల పరిరక్షణ కోసం అంకారావు చేస్తున్న కృషి తనకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని తెలిపారు. అటువంటి వ్యక్తిని ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి, అధికారులకు పవన్ ధన్యవాదాలు తెలియజేశారు.

పర్యావరణ పరిరక్షణ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తనకు స్ఫూర్తి అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. "చెట్టు-నీరు" వంటి కార్యక్రమాల ద్వారా చంద్రబాబు పర్యావరణ పరిరక్షణకు ఎంతో కృషి చేశారని, ఆయన మార్గదర్శకత్వంలో పర్యావరణ మంత్రిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని చెప్పారు. "ప్రస్తుతం అటవీ, పర్యావరణ శాఖల బాధ్యతలు నా వద్ద ఉన్నాయి. వచ్చే ఏడాది ఇదే సమయానికి కోటి మొక్కలు నాటడమే కాకుండా, అడవుల్లో కార్చిచ్చులను అరికట్టి, గొర్రెలు, మేకల కాపరులకు అవగాహన కల్పించి, అడవుల నరికివేతను తగ్గించి, అప్పుడు మరింత అనుభవంతో మీ ముందుకొచ్చి మాట్లాడతాను" అని పవన్ కల్యాణ్ అన్నారు.

చెట్లు మన జీవితంలో ఎంత కీలకమో వివరిస్తూ, "ఒకప్పుడు ఇళ్లకు దారి చెప్పాలంటే మర్రిచెట్టునో, గోరింటాకు చెట్టునో ఆనవాలుగా చెప్పేవాళ్ళం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. చెట్లు లేని జీవితాన్ని ఊహించుకోలేం. అవి కేవలం పక్షులకే కాదు, ప్రతి ఒక్కరికీ ఆధారం" అని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో 50 శాతం పచ్చదనం సాధించాలన్న ముఖ్యమంత్రి లక్ష్యాన్ని చేరుకోవడానికి తన వంతు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. "ముఖ్యమంత్రి గారు మా అందరికీ రాష్ట్రంలో 33 శాతం కాకుండా, 50 శాతం అటవీ విస్తీర్ణం ఉండాలని లక్ష్యం నిర్దేశించారు. ఆంధ్రప్రదేశ్‌ను పర్యావరణ పరిరక్షణలో, అటవీ సంరక్షణలో, నగర వనాల్లో తలమానికంగా నిలపడానికి మనమందరం కృషి చేద్దాం" అని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి ఇచ్చే సూచనలు, సలహాలు స్వీకరించి, వచ్చే ఏడాదికి నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకుని ఆయన మెప్పు పొందేలా పనిచేస్తామని పవన్ కల్యాణ్ తన ప్రసంగాన్ని ముగించారు.

# బెంగళూరు తొక్కిసలాట ఘటన.. మీడియా ముందు కన్నీళ్లు పెట్టుకున్న డిప్యూటీ సీఎం డీకే శివకుమార్

**హైదరాబాద్ పెన్ పవర్:** బెంగళూరు నిన్న జరిగిన ఘోర దుర్ఘటన పెను విషాదాన్ని మిగిల్చింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టు తొలిసారిగా ఐపీఎల్ టైటిల్ గెలుచుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సంబరాల్లో తీవ్ర తొక్కిసలాట జరిగింది. ఈ దురదృష్టకర ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోగా, 47 మంది వరకు గాయపడ్డారు. ఈ సంఘటనపై కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆయన కన్నీటి పర్యంతమయ్యారు.

"ఆ చిన్నారుల గురించి నాకు చాలా ఆందోళనగా ఉంది. వాళ్లు 15 ఏళ్ల వయసు వాళ్లు. కనీసం 10 మంది చనిపోవడం నా కళ్లారా చూశాను. ఈ నష్టాన్ని ఏ కుటుంబం తట్టుకోలేదు" అంటూ డీకే శివకుమార్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మీడియా ముందే కన్నీళు పెట్టుకున్నారు. చిన్నస్వామి స్టేడియం వెలుపల జరిగిన ఈ ఘటనలో మృతి చెందిన వారిని చూసి తాను చలించిపోయానని ఆయన తెలిపారు.

పరిస్థితి ఎంత వేగంగా చేయిదాటిపోయిందో వివరిస్తూ, "కార్యక్రమాన్ని పది నిమిషాల్లో ముగించేయాలని పోలీస్ కమిషనర్ నాకు చెప్పారు. అందుకే కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేశాను. అప్పటికే ఒకరిద్దరు చనిపోయారని, వెంటనే ముగించమని ఆయన నాతో అన్నారు" అని శివకుమార్ వెల్లడించారు.

ప్రభుత్వం నుంచి సహాయం.. విచారణకు ఆదేశం

ఈ దుర్ఘటనపై కర్ణాటక ప్రభుత్వం తక్షణమే స్పందించింది. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారాన్ని ప్రకటించింది. గాయపడిన వారికి ఉచితంగా మెరుగైన వైద్యం అందిస్తామని హామీ ఇచ్చింది. సీఎం సిద్ధరామయ్య ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

"ఇలాంటి విషాదం జరిగి ఉండాల్సింది కాదు. ఈ ఘటనపై ప్రభుత్వం తీవ్ర విచారాన్ని వ్యక్తం చేస్తోంది" అని ఆయన అన్నారు. స్టేడియం సామర్థ్యం కేవలం 35వేలు కాగా, సంబరాల కోసం సుమారు 2 నుంచి 3 లక్షల మంది ప్రజలు గుమిగూడారని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనపై 15 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించారు.

రాజకీయ దుమారం.. న్యాయపరమైన చర్యలు

ఈ దుర్ఘటన రాజకీయంగా కూడా తీవ్ర దుమారం రేపింది. కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి మాట్లాడుతూ... డీకే శివకుమార్ అపరిపక్వత, బాధ్యతారాహిత్య ప్రవర్తన వల్లే ఈ విషాదం జరిగిందని ఆరోపించారు. ఆయన తక్షణమే డిప్యూటీ సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు, సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ, సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మరియు కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపిస్తూ, వారిపై ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 106 కింద పోలీసులకు ఫిర్యాదు చేశారు.

స్టేడియంలోని గేట్ నెం.7 వద్ద ఈ తొక్కిసలాట చోటుచేసుకుంది. ఆర్సీబీ తొలి ఐపీఎల్ టైటిల్ విజయాన్ని పురస్కరించుకుని నగరం మొత్తం జరుపుకోవాల్సిన వేడుక కాస్తా, సరైన ప్రణాళిక లేకపోవడం, అస్పష్టమైన సమాచారం, నియంత్రణ చర్యలు విఫలం కావడం వల్ల విషాదంగా మారిందని తెలుస్తోంది. ఈ ఘటనను కర్ణాటక హైకోర్టు సుమోటోగా స్వీకరించి, విచారణకు తేదీని ఖరారు చేసింది. ఈ దుర్ఘటనకు గల పూర్తి కారణాలు విచారణ అనంతరం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# ఆసుపత్రిలో చేరిన మాగంటి గోపీనాథ్.. ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరం!

- మొదటి పేజీ తరువాయి

సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వార్తలు వస్తున్నాయి. వైద్య బృందం ఆయన ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తోంది.

ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఏఐజీ ఆసుపత్రికి చేరుకున్నారు. వారు గోపీనాథ్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ, మాగంటి గోపీనాథ్‌కు ప్రస్తుతం ఐసీయూలో చికిత్స కొనసాగుతోందని తెలిపారు.

# బెంగళూరు తొక్కిసలాట: కర్ణాటక ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

- మొదటి పేజీ తరువాయి

విచారణకు కూడా ఆదేశించారు. ఇంత భారీ సంఖ్యలో ప్రజలు వస్తారని ప్రభుత్వం ఊహించలేకపోయిందని ఆయన అన్నారు.

ఈ విషాద ఘటనపై రాజకీయంగా తీవ్ర దుమారం రేగింది. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, సరైన ఏర్పాట్లు చేయకపోవడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ప్రతిపక్ష నేతలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ దుర్ఘటన "హృదయ విదారకం" అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. మరోవైపు, జేడీ(ఎస్), బీజేపీ నేతలు మాత్రం ఇది రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమేనని ఆరోపిస్తూ, బాధ్యుల రాజీనామాకు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ప్రస్తుతం ఉన్నత న్యాయస్థానం జోక్యం చేసుకోవడంతో ప్రభుత్వ స్పందన ఎలా ఉంటుందో వేచి చూడాలి.

పెన్ పవర్
వై.ఎస్.ఆర్. కడప
అన్నమయ్య జిల్లా

# మొక్కల పెంపకంపై ప్రజల్లో అవగాహన కల్పించండి

**రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్**




**నంద్యాల, పెన్ పవర్ జూన్ 05 :** పర్యావరణాన్ని పరిరక్షించి వాతావరణ సమతుల్యతకు ప్రజలందరూ భాగస్వాములై మొక్కలు నాటే కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పిలుపునిచ్చారు. గురువారం నంద్యాల పట్టణంలోని మునిసిపల్ హైస్కూల్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ఏర్పాటుచేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ ఫారెస్ట్ కన్జర్వేటర్ కృష్ణమూర్తి, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మంజునాథ్, ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి, డిఇఓ జనార్దన్ రెడ్డి, సామాజిక అడవుల డిఎఫ్ఓ నాగమనేశ్వరి తదితరులు పాల్గొని జ్యోతి వెలిగించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ వనమహోత్సవం కార్యక్రమం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రజల చేరువకు తీసుకెళ్లి వారిలో చైతన్యం రేకెత్తించి ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. గతంలో నంద్యాల ప్రాంతమంతా చెట్లతో నిండిపోయి ఉండేదని తరువాయి 4లో..

## టీటీడీ సీవీఎస్వోగా కే.వీ.మురళీకృష్ణ బాధ్యతలు స్వీకరణ





**తిరుమల పెన్ పవర్ జూన్ 5 :** టీటీడీ ముఖ్య నిఘా మరియు భద్రతాధికారిగా కే.వీ.మురళీకృష్ణ గురువారం తిరుమల శ్రీవారి ఆలయంలో బాధ్యతలు స్వీకరించారు. ముందుగా శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న సీవీఎస్వో రంగనాయకులు మండపంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు సీవీఎస్వోకు తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అదనపు సీవీఎస్వో వెంకట శివకుమార్ రెడ్డి, వీజీవోలు రామ్ కుమార్, సురేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీ పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయండి : జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల, పెన్ పవర్ జూన్, 05 :** జిల్లాలో ఈనెల 6వ తేదీ నుండి 30వ తేదీ వరకు డీఎస్సీ పరీక్షల నిర్వహణకు పగడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్ లో మెగా డీఎస్సీ నిర్వహణపై సంబంధిత అధికారులతో కోఆర్డినేషన్ సమీక్ష నిర్వహించారు. సమీక్షలో ఏఎస్పి మంద జవాలి అల్ఫోన్స్, నంద్యాల ఆర్డీఓ విశ్వనాధ్, డీఈఓ జనార్దన్ రెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్సీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ఈనెల 6వ తేదీ నుండి 30వ తేదీ వరకు నిర్వహించే మెగా డీఎస్సీ పరీక్షలకు ఎలాంటి లోపాలకు తావివ్వకుండా పగడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డీఎస్సీ పరీక్షలకు 33,684 మంది అభ్యర్థులు హాజరవుతున్నారన్నారు. జిల్లా కేంద్రంలో శ్రీ రామకృష్ణ డిగ్రీ మరియు పీజీ కాలేజీలు, శాంతిరాం తరువాయి 4లో..

# పెట్టుబడులకు పరిశ్రమల స్థాపనకు రాష్ట్రంలో పుష్కల అవకాశాలు

**ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కొరకు భారత ప్రభుత్వం పిఎల్ఐ, ఇన్సెంటివ్స్ పెద్ద ఎత్తున ప్రమోట్ చేస్తోంది : ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటి భారత జాయింట్ సెక్రెటరీ సుశీల్ పాల్**

**ముఖ్యమంత్రి సారథ్యంలో రాష్ట్రంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మాత్రమే కాదు.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తున్నాం : సెక్రటరీ ఐటిఈ&సి భాస్కర్ కాటమనేని**







**తిరుపతి, పెన్ పవర్ జూన్05 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులకు, పరిశ్రమల స్థాపనకు పుష్కల అవకాశాలు ఉన్నాయని, తిరుపతి లో నిర్వహించిన ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ మ్యానుఫ్యాక్చరింగ్ స్కీం (ECMS) మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ మ్యానుఫ్యాక్చరింగ్ పాలసీ ముసాయిదా.... పెట్టుబడుల ప్రమోషన్ వర్క్ షాప్ విజయవంతం అయిందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి సారథ్యంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మాత్రమే కాదు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తున్నామని ఐటిఈ&సి శాఖ సెక్రటరీ భాస్కర్ కాటమనేని పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ మ్యానుఫ్యాక్చరింగ్ స్కీం (ECMS) మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ మ్యానుఫ్యాక్చరింగ్ పాలసీ పెట్టుబడుల ప్రమోషన్ కొరకు ఐటి ఈ&సి మరియు ఏపీ ఎకనామిక్ డెవలప్మెంట్ బోర్డు, ఇండియా సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ వారు సంయుక్తంగా ఒక్క రోజు కార్యశాలను మారస సరోవర్ ప్రీమియర్ హోటల్ తిరుపతి నందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారత జాయింట్ సెక్రెటరీ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటి సుశీల్ పాల్, ఏపీ సెక్రటరీ ఆంధ్ర ప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ కార్యదర్శి భాస్కర్ కాటమనేని, రాజేష్ శర్మ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మరియు ప్రిన్సిపాల్ అడ్వైసర్ ఇండియా సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్, రష్మి రతి తివారీ సైంటిస్ట్, పలు పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. భారత జాయింట్ సెక్రెటరీ తరువాయి 4లో..

## కల్పవృక్ష వాహనంపై శ్రీ గోవిందరాజస్వామి



**తిరుమల పెన్ పవర్ జూన్ 5 :** తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన గురువారం ఉదయం గోవిందరాజస్వామివారు కల్పవృక్ష వాహనంపై భక్తులను కటాక్షించారు. ఉదయం 7 గంటల నుండి వాహనసేవ వైభవంగా సాగింది. వాహనం ముందు గజరాజులు ఠీవిగా నడుస్తుండగా, భక్తజన బృందాల కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి వారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రకృతికి శోభను సమకూర్చేది చెట్టు. అనేక విధాలైన వృక్షాలు సృష్టిలో ఉన్నాయి. అందులో మేటి కల్పవృక్షం. ఇతర వృక్షాలు తమకు కాచిన ఫలాలను మాత్రమే ప్రసాదిస్తాయి. అలాకాక కల్పవృక్షం వాంఛిత ఫలాలనన్నింటినీ ప్రసాదిస్తుంది. సముద్ర మథనంలో సంకల్ప వృక్షంగా ఆవిర్భవించిన దేవతావృక్షం కల్పవృక్షం. భక్తుల కోరికలు ఈడేర్చే కోనేటి రాయుడు ఈ కల్పవృక్షాన్ని అధిరోహించి భక్తులను అనుగ్రహిస్తాడు. అనంతరం ఉదయం 10.00 నుండి 11 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, పలురకాల పండ్ల రసాలతో అభిషేకం చేశారు. సాయంత్రం 5.30 నుండి 6.00 వరకు తరువాయి 4లో..

## జీవితంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

**– ప్లాస్టిక్ వాడకం పూర్తిగా తగ్గించాలి – జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక**




**చిత్తూరు, పెన్ పవర్ జూన్ 05 :** రాబోయే తరాల వారికి మంచి వాతావరణాన్ని అందించడం కోసం ప్రతి ఒక్కరు ఇంటి వద్ద మొక్కలు నాటాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి అరుణ సారిక పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం 2025 లో భాగంగా గురువారం స్థానిక జిల్లా కోర్టు ఆవరణ నందు జిల్లా న్యాయమూర్తుల తో కలిసి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూరాబోయే తరాల వారికి మంచి వాతావరణాన్ని అందించడం కోసం ప్రతి ఒక్కరు ఇంటి వద్ద మొక్కలు నాటాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి భారతి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించుకోవడం జరుగుతుందని అందులో భాగంగానే జిల్లా కోర్టు ఆవరణలో మొక్కలు నాటడం






జరిగిందని తెలిపారు. ప్లాస్టిక్ ఒక భాగం అయిపోయిందని, ప్రతి రోజు ప్లాస్టిక్ వాడకం తప్పులేదని పర్యావరణాన్ని కాపాడడానికి ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని కోవలన్నారు. ప్లాస్టిక్ వాడకం వలన భూ కాలుష్యం క్యాన్సర్ వస్తుందని,ఇలాగే ప్లాస్టిక్ వాడడం వల్ల రాబోయే రోజుల్లో ప్రతి ఇంటి లో ఒకరికి క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. ప్లాస్టిక్ వాడి పడేసే వస్తువుల వినియోగం తగ్గించడం ద్వారా భూ కాలుష్యం తగ్గుతుందని తెలిపారు.

మొక్కలు నాటడం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2025 లో బాగంగా మొక్కలు నాటి వాటి సంరక్షణ తీసుకొంటామని,ప్లాస్టిక్ వాడమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యావరణ పరిరక్షణ శాఖ అధికారులు రాజశేఖర్,కుమార్, జిల్లా న్యాయ మూర్తులు,న్యాయవాదులు,కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో మత్తు పదార్థాల సాగు, రవాణా, వినియోగాన్ని

# పూర్తి స్థాయిలో అరికట్టాలి

**ప్రతి విద్యా సంస్థలో ఈగల్ టీంలు ఏర్పాటు చేయాలి : జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఎస్పీ విక్రాంత్ పాటిల్**





**కర్నూలు, పెన్ పవర్ జూన్ 05 :** జిల్లాలో మత్తు పదార్థాల సాగు, రవాణా, వినియోగాన్ని పూర్తి స్థాయిలో అరికట్టాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నార్కోటిక్స్ కో ఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించారు. గంజాయి సాగు,రవాణా, నియంత్రణ చర్యలు, మాదక ద్రవ్యాల వాడకంపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖలు ఈ అంశాన్ని సీరియస్ గా తీసుకుని పూర్తిస్థాయి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.. గంజాయి సాగు రవాణాను నియంత్రించడంతోపాటు పూర్తిస్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు ముఖ్యంగా ఎక్సైజ్, హెల్త్, మున్సిపల్ కమిషనర్ లు వారు నిర్వహించే ప్రతి కార్యక్రమంలో ఈ అంశాన్ని కూడా అజెండాగా చేర్చుకుని అవగాహన పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.. పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.. గ్రామాల్లో డ్రగ్స్ వినియోగించినా, గంజాయి సాగు చేసినట్లు తేలితే, సంబంధిత విఆర్ఓ తో పాటు సర్పంచ్ తదితర గ్రామ స్థాయి అధికారుల పై కూడా కేసులు పెట్టే అవకాశం ఉందని, అందువల్ల జాగ్రత్తగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.. డ్రగ్స్ నిర్మూలనపై ముద్రించిన పోస్టర్లను ప్రతి సచివాలయంలో ఏర్పాటు చేయించాలని ఆర్డీవో లను ఆదేశించారు. జనరల్ హాస్పిటల్ లోని ఉన్న డి అడిక్షన్ సెంటర్ కు సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకోవాలని, ఇందుకు సంబంధించిన ఫైల్ రన్ చేయాలని కలెక్టర్ సంబంధిత సిబ్బందిని అధికారులను ఆదేశించారు.. డి అడిక్షన్ సెంటర్ లో టెస్టింగ్ కిట్స్ లేకపోతే వాటిని కొనుగోలు చేయాలని సూచించారు. అలాగే అన్ని పాఠశాలలు,కళాశాలలలో, యూనివర్సిటీల్లో వాల్ రైటింగ్స్ ఏర్పాటు చేయాలని, విద్యార్థులతో నిర్దేశించిన ఒక రోజు ప్రతిజ్ఞ కూడా చేయించాలని కలెక్టర్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పంట సీజన్ మొదలైనందున గంజాయి సాగు పై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ ప్రతి విద్యా సంస్థ లో ఈగల్ టీం లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 7 %చీణూా% కేసులను గుర్తించామని, ఈ సంఖ్య తక్కువైనప్పటికీ అలర్ట్ గా ఉండాలని అధికారులను ఆదేశించారు.. విద్యా సంస్థల్లో హోర్డింగుల ఏర్పాటు, అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జి జి హెచ్ లో ఉన్న డి అడిక్షన్ సెంటర్ యాక్టివ్ గా పని చేయాలని సూచించారు.. మత్తు పదార్థాలను వినియోగించిన వారిని పరీక్ష చేసేందుకు టెస్టింగ్ కిట్స్ ఏర్పాటు చేయాలని ఎస్పీ సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, ఎక్సైజ్ సూపరిన్టెండెంట్ సుధీర్ కుమార్, డిఎంహెచ్వో శాంతి కళ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు పెంచుదాం... పర్యావరణాన్ని కాపాడుదాం

**- జడ్పీ చైర్మన్ ఆనం అరుణమ్మ**



**నాయుడుపేట, పెన్ పవర్ ప్రతినిధి, జూన్ 5 :** మొక్కలు పెంచి, పర్యావరణాన్ని కాపాడదామని నెల్లూరు జడ్పీ చైర్మన్ ఆనం అరుణమ్మ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం నెల్లూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ ఆనం అరుణమ్మ మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఒక మొక్క నాటి పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో, నాయుడుపేట ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటుదాం.. ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారిద్దాం

**జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, సిఎఫ్ఓ యశోదాబాయి**





**అనంతపురం, పెన్ పవర్ జూన్ 05 :** ఆత్మకూరు మండలంలోని పంపనూరు గ్రామం వద్దనున్న నగరవనంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం – 2025 సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, సిఎఫ్ఓ యశోదాబాయి, తదితరులు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం – 2025లో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటుదాం.. ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారిద్దాం.. పచ్చని పుడమిని భావితరాలకు అందిద్దాం అనే నినాదంతో మొక్కలు నాటే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, రాప్తాడు ఎమ్మెల్యే, సిఎఫ్ఓ తదితరులు పాల్గొని మొక్కలను నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, జిల్లాలో విస్తృతంగా మొక్కల పెంపకం చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఎ.మాలోల, ప్రోగ్రాం అధికారి గురు ప్రభాకర్, ఆర్డీఓ కేశవనాయుడు, ఎస్డీసి రామ్మోహన్, అటవీ శాఖ ఎఫ్ఆర్ఓలు శ్రీనివాసులు, మధుబాబు, చంద్రశేఖర్, జిల్లా పరిషత్ సీఈవో రామసుబ్బయ్య, డ్వామా పీడీ సలీం భాష, ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, ఎంపిడిఓ విజయలక్ష్మి, ఆయా శాఖల అధికారులు, అటవీ శాఖ సిబ్బంది, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీపై రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ



**పలమనేరు జూన్ 5,(పెన్ పవర్) :** పలమనేరు మండలం లోని పెంగరగుంట రైతు సేవాకేంద్రం నందు గురువారం రైతుల కు వేరుశనగ విత్తనాలను వ్యవసాయ అధికారిని సంధ్య అందించారు. 40శాతం రాయితీపై పంపిణీ చేయడం జరుగుతోందని, ప్రతి రైతు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డ్ లింక్ అయిన ఫోన్ నెంబర్ తీసుకొని రైతుసేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భవనేశ్వరి,టీడీపీ నాయకులు నాగరాజ రెడ్డి, జగదీశ్ నాయిడు, పెద్దబ్బ,అమరనాథ్ రెడ్డి,గిరి, స్వతంత్ర బాబు, రామచంద్ర నాయిడు,దామోదర్,నక్షత్రయ్య, జయప్రకాష్,రైతు సేవాకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రతిభ అవార్డులకు సాయి శ్రీచైతన్య విద్యార్థుల ఎంపిక







**పలమనేరు జూన్ 5,(పెన్ పవర్) :** రాష్ట్ర ప్రతిభ అవార్డులలో చిత్తూరు జిల్లా నుండి ఎంపికైన విద్యార్థులలో గంగవరం మండలానికి చెందిన సాయి శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు ఇద్దరు ఉన్నారు. ఇందులో గ్రామీణ ప్రాంతాలకు చెందిన సిఈసి విద్యార్థులు హుమేరా వెయ్యి మార్కులకు గాను 970మార్కులు, సుస్మిత 965 మార్కులు పొందిన విద్యార్థులు ప్రతిభ అవార్డులకు ఎంపికయ్యారు. ఇంతటి ఉన్నతమైన అవార్డుకి ఎంపికైన విద్యార్థులను,అందుకు సహకరించిన అధ్యాపకులను, ప్రోత్సహించిన తల్లిదండ్రులను కళాశాల యాజమాన్యం ఎంవిఆర్ రెడ్డి, కిషోర్ కుమార్, ప్రమోద్ కుమార్‌లు ప్రత్యేకంగా అభినందించారు.

## జూన్ 9 నుంచి 11వ తేదీ వరకు జ్యేష్టాభిషేకం



**తిరుపతి పెన్ పవర్ జూన్ 5 :** ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు తిరుమలలోని శ్రీవారి ఆలయంలో సాలకట్ల జ్యేష్టాభిషేకం జరుగనుంది. ప్రతి సంవత్సరం జ్యేష్ట మాసంలో జ్యేష్టా నక్షత్రానికి ముగిసేట్లుగా మూడురోజుల పాటు తిరుమల శ్రీవారికి జ్యేష్టాభిషేకం నిర్వహిస్తారు. సంపంగి ప్రదక్షిణ ప్రాకారం లోని కల్యాణ మండపంలో నిర్వహించే ఈ క్రతువును "అభిద్యేయక అభిషేకం" అని కూడా అంటారు. తరతరాలుగా అభిషేకాలతో అత్యంత ప్రాచీనములైన స్వామివారి ఉత్సవ మూర్తులు అరిగిపోకుండా పరిరక్షించేందుకు ఈ ఉత్సవాన్ని ఏర్పాటు చేశారు. మొదటి రోజు శ్రీమలయప్పస్వామివారికి ఉన్న బంగారు కవచాన్ని తీసివేసి, హోమాలు, అభిషేకాలు పంచామృత స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఆ తర్వాత శ్రీ స్వామివారికి వజ్రకవచం అలంకరిస్తారు. రెండవరోజు ముత్యాల కవచం సమర్పిస్తారు. మూడవ రోజు తిరుమంజనాదులు పూర్తిచేసి, బంగారు కవచాన్ని పునః సమర్పిస్తారు. ఈ బంగారు కవచాన్ని మళ్లీ వచ్చే ఏడాది జ్యేష్టాభిషేకం సమయంలోనే తీస్తారు. అంతవరకు సంవత్సరం పొడవునా శ్రీవారు బంగారు కవచంతోనే వివిధ ఉత్సవాల్లో పాల్గొంటారు.

## జూన్ 07 నుండి 11 తేదీ వరకు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు

**తిరుపతి పెన్ పవర్ జూన్ 5 :** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు జూన్ 07 నుండి 11వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఘనంగా జరుగనున్నాయి. ఈ ఉత్సవాల్లో శ్రీ అలమేలు మంగమ్మ పద్మసరోవర తీరంలో పాంచరాత్ర ఆగమపూజలు అందుకుని భక్తులను అనుగ్రహిస్తారు. ప్రతి సంవత్సరం అమ్మవారికి జ్యేష్ఠశుద్ధ ఏకాదశి నుండి పౌర్ణమి వరకు రమణీయంగా తెప్పోత్సవాలు నిర్వహిస్తారు. తెప్పోత్సవాల్లో పాల్గొన్న భక్తులకు తిప్పలు, సంసార దుఃఖాలు తొలగి, మోక్షం సిద్ధిస్తుంది. పద్మసరస్సులో బంగారు పద్మం నుండి ఆవిర్భవించిన అలమేలు మంగ జీవకోటికి మాతృమూర్తిగా మారి భవజలధిలో మునిగిపోకుండా రక్షించి, సర్వసౌఖ్యాలు ప్రసాదిస్తారని తెప్పోత్సవాల అంతరార్థం. జూన్ 07వ తేదీ మొదటి రోజు రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి, రెండో రోజు శ్రీ సుందరరాజస్వామి, చివరి మూడు రోజులు శ్రీ పద్మావతి అమ్మవారు తెప్పలపై విహరిస్తారు. తెప్పోత్సవాల్లో భాగంగా జూన్ 07వ తేదీ రాత్రి 7.30 - 8.30 గం.ల మధ్య శ్రీకృష్ణ స్వామివారు, జూన్ 08వ తేదీన శ్రీ సుందరరాజస్వామి వారు, జూన్ 09వ తేదీన శ్రీ పద్మావతీ అమ్మవారు నాలుగు మాడ వీధులలో విహరించనున్నారు. జూన్ 10వ తేదీ రాత్రి 8.30 - 10.00 గం.ల మధ్య గజ వాహనంపై, 11 తేదీ రాత్రి 8.30 - 10.00 గం.ల వరకు గరుడ వాహనంపై అమ్మవారు భక్తులను ఆశీర్వదించనున్నారు. జూన్ 14న ఉత్తరాషాడ నక్షత్రం సందర్భంగా సాయంత్రం 6.45 గంటలకు ఆలయ మాడ వీధులలో గజ వాహనంపై అమ్మవారు విహరించి భక్తులను అనుగ్రహించనున్నారు.

**ఆర్జితసేవలు రద్దు :** తెప్పోత్సవాల కారణంగా తిరుచానూరు అమ్మవారి ఆలయంలో ఐదు రోజుల పాటు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవను రద్దు చేశారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజు ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కోలాటాలు నిర్వహించనున్నారు.

## కల్పవృక్ష వాహనంపై శ్రీ గోవిందరాజస్వామి





**(3వ పేజీ తరువాయి)** ఊంజల్‌సేవ వైభవంగా జరుగనుంది. రాత్రి 7 నుండి 9.00 గంటల వరకు సర్వ భూపాలవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమివ్వను న్నారు. "రాజా ప్రజారంజనాత్" అన్నట్లు ప్రజలను రంజింప జేసేవారే రాజులు. అనంతవిశ్వానికి సర్వభూపాలుడు అయిన శ్రీ గోవిందరాజస్వామి కలియుగంలో దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం సర్వభూపాల వాహనాన్ని అధిరోహిస్తాడు. అంతేగాక పాలకుల అధికారి దుర్వినియోగం కాకుండా ఉండాలంటే వారు భగవత్సేవాపరులు కావాలని సర్వభూపాల వాహనసేవ ద్వారా స్వామివారు దివ్యమైన సందేశాన్ని ఇస్తారు.

**జూన్ 06న గరుడసేవ :** తిరుపతిలోని శ్రీ గోవిందరాజ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి 7 నుండి 10 గంటల వరకు గరుడసేవ వైభవంగా జరుగనుంది. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్న జీయంగార్లు, డిప్యూటీ ఈవో వి.ఆర్.శాంతి పలువురు అధికారులు, అర్చకులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

### మెగా డీఎస్సీ పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయండి : జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**(3వ పేజీ తరువాయి)** ఇంజనీరింగ్ కాలేజ్, ఆర్జీఎం ఇంజనీరింగ్ కాలేజ్, ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కాలేజీలలో పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఎలాంటి లోపాలకు తావివ్వకుండా అన్ని రకాల ముందస్తు జాగ్రత్త చర్యలు తీసు కోవాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్షలు సజావుగా నిర్వహించడానికి గాను ఐదు మంది డిపార్ట్మెంట్ ఆఫీసర్లను నియమించామన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్డీఓను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల పరిధిలో ఏ ఒక్క చిన్న సంఘటన కూడా జరగకుండా పరీక్షలు సజావుగా నిర్వహిం చాలని కలెక్టర్ పోలీసు అధికారులను ఆదేశించారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకు నేలా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారు లను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలని డిఎంహెచ్ఓను కలెక్టర్ ఆదేశించారు.

### కడప కోర్టు ఆవరణంలో మొక్కలను నాటిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ యామిని



**కడప పెన్ పవర్ జూన్ 5 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా, గౌరవ చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప డాక్టర్ సి.యామిని "ప్రపంచ పర్యావరణం దినోత్సవం" సందర్భంగా కోర్టు ఆవరణము నందు మొక్కలు నాటడం జరిగినది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం థీమ్ 2025:ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం. ఈ కార్యక్రమంలో గౌరవ రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఇంచార్జ్ నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి కడప శ్రీమతి కే.సత్య కుమారి, గౌరవ ఏడవ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.రమేష్ కుమార్, గౌరవ సెక్రటరీ-కం- సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఎస్.బాబా ఫక్రుద్దీన్, గౌరవ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ కె.ప్రతిషకుమారి, గౌరవ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కె.భార్గవి, గౌరవ మూడవ అదుపు జూనియర్ సివిల్ జడ్జ్ జి.విజయలక్ష్మి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీదేవి మరియు న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి



**పలమనేరు జూన్ 5 ,(పెన్ పవర్) :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణం లోని యూపీఎస్సీ కాకా తోపు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చందన ప్రియ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆమె మాట్లాడుతూ.. పర్యావరణాన్ని రక్షించుకొను బాధ్యత ప్రతి భారతీయ పౌరుని మీద ఉన్నదని, నానాటికి చెట్ల శాతము తగ్గిపోయి వాతావరణంలో మార్పుల వలన మానవుని ఆరోగ్యంపై తీవ్ర ప్రభావము చూపుతుందని, అలాగే ప్రకృతిలో చెట్లు భూమి నీరు సమతుల్యముగా ఉన్నప్పుడే జీవన ప్రమాణము మెరుగుగా ఉండి భూమిపై నివసించు ప్రతి ప్రాణి ఆరోగ్యంగా జీవించుటకు అనుకూలంగా ఉంటుందన్నారు.

## పెట్టుబడులకు పరిశ్రమల స్థాపనకు రాష్ట్రంలో పుష్కల అవకాశాలు



**(3వ పేజీ తరువాయి)** ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటి శ్రీ సుశీల్ పాల్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కొరకు భారత ప్రభుత్వం పిఎల్ఐ, ఇన్సెంటివ్స్ అందజేస్తూ పెద్ద ఎత్తున ప్రమోట్ చేస్తోందని తెలిపారు. పెద్ద ఎత్తున ముందుకు వస్తున్న పారిశ్రామికవేత్తలకు అభినందనలు అని తెలిపారు. ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లకు మంచి డిమాండ్ ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు చక్కగా ఉన్నాయని తెలిపారు. పలు రాష్ట్రాలు ఈ స్కీం అమలు చేస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా సెక్రటరీ ఐటిఈ%డ%సి భాస్కర్ కాటమనేని మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కు సంబంధించి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ మధ్య మార్గదర్శకాలు విడుదల చేసి ఉన్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన పాలసీ కన్నా అదనంగా మన ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నుండి రాయితీలు గానీ, సదుపాయాలు కానీ



మెరుగ్గా అందించడానికి మన ఆంధ్ర ప్రదేశ్ పాలసీ మెరుగ్గా ఉండేలా రూపొందిస్తున్నామని అన్నారు. అందులో భాగంగా తిరుపతి జిల్లాలో మారస సరోవర్ ప్రీమియర్ హోటల్ నందు ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ మ్యానుఫ్యాక్చర్ చేసే కంపెనీలు వారి ప్రతినిధులతో ఒక్కరోజు వర్క్ షాప్ నిర్వహించడం జరిగిందని అన్నారు. ఇప్పటివరకు వేరే దేశాల నుండి దిగుమతి చేసుకుంటున్న ఎలక్ట్రానిక్ కాంపోనెంట్ల స్థానంలో మన రాష్ట్రంలో స్థానికంగా ఎలక్ట్రానిక్ కాంపోనెంట్లు తయారీ చేసే పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తూ మంచి విధానాన్ని తీసుకురానున్నామని తెలిపారు. అంతేకాకుండా 25 శాతం ఎలక్ట్రానిక్ కాంపోనెంట్లు మ్యాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లు దక్షిణ రాయలసీమ నందు నెలకొల్పటానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలోనే పలు పారిశ్రామికవేత్తలతో పరిశ్రమల ప్రతినిధులతో ఒకరోజు కార్యశాల ఏర్పాటు చేసి వారిని మన ఆంధ్రప్రదేశ్లో పెట్టుబడులు పెట్టాలని కోరామని సదరు వర్క్ షాప్ విజయవంతమైందని సెక్రటరీ ఐటీ ఈ%డ%సీ పేర్కొన్నారు. మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పడానికి పుష్కలంగా అవకాశాలు ఉన్నాయని తెలిపారు. శ్రీసిటీ లోని ఎల్జి పరిశ్రమకు ఆరు నెలల్లోనే భూమి పూజ చేయడం జరిగిందని అన్నారు. శ్రీ సిటీ నందు 200 పైన పరిశ్రమలు ఉన్నాయని, ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్న ఒక గొప్ప పారిశ్రామిక వాడ అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెక్నాలజీ వినియోగించి పారదర్శకమైన సుపరిపాలనను ఏఐ టెక్నాలజీ, వాట్సాప్ గవర్నెన్స్, ఆర్టీజీ, ఐ.ఓ.టీ, డ్రోన్స్ తదితర వాటి వినియోగంతో అందిస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. మన అందరికీ తెలుసు గత పది సంవత్సరాల నుండి ఆంధ్రప్రదేశ్ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో అగ్రస్థానంలో



ఎప్పుడు ఉంటోందని తెలిపారు. తిరుపతి నందు ఈఎంసీ-2 క్లస్టర్, ఈఎంసి కొప్పర్తి తదితర ఎలక్ట్రానిక్స్ పారిశ్రామిక వాడలు ఉన్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సన్రైస్ ఆంధ్ర ప్రదేశ్ అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ ప్రభుత్వమని ఈజ్ ఆఫ్ డూఇంగ్ బిజినెస్ మాత్రమే కాదు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తున్నామని తెలిపారు. పారిశ్రామికవేత్తలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వారి సమస్యలను అతి తక్కువ సమయంలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మన రాష్ట్రంలో రైల్వే కనెక్టివిటీ, రహదారులు, విమానాశ్రయాలు, పోర్టులు తదితర సదుపాయాలు పుష్కలంగా ఉన్నాయని, తగినంత ల్యాండ్ బ్యాంక్ ఉందని తెలిపారు. భారత ప్రభుత్వం లక్ష్యాల కు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విజన్ 2047 తో ముందుకు వెళుతుందని తెలిపారు. 2.40 ట్రిలియన్స్ ఎకానమీ 2047 నాటికి ఐటి మాత్రమే కాకుండా ఇతర పరిశ్రమలు, ఇతర సెక్టార్ల నుండి అందిపుచ్చుకోవాలనేది మన రాష్ట్ర లక్ష్యం అని తెలిపారు. రాష్ట్రంలో పలు ఉన్నత విద్యా యూనివర్సిటీలు ఉన్నాయని తగినంత మంది నైపుణ్యం కలిగిన స్కిల్డ్ పర్సన్స్ అందుబాటులో ఉన్నారని తెలిపారు. పరిశ్రమలకు కావలసిన మేరకు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించి తయారు చేసే కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతోందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పారిశ్రామికవేత్తలు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పరిశ్రమలను ప్రోత్సహిస్తూ గౌరవ ముఖ్యమంత్రి పలు చర్యలు తీసుకుంటూ పారిశ్రామికవేత్తలకు అండగా ఉండే పాలసీ అమలు చేస్తున్నారని కొనియాడారు. అనంతరం జాయింట్ సెక్రెటరీ భారత ప్రభుత్వం వారికి ఏపీ సెక్రెటరీ ఐటీ ఈ&సీ వారికి, ముఖ్య అతిథులకు, పలువురు పారిశ్రామికవేత్తలకు మొమెంటోలు అందజేశారు.

## మొక్కల పెంపకంపై ప్రజల్లో అవగాహన కల్పించండి






**(3వ పేజీ తరువాయి)** ప్రజల అవసరాలు, అభివృద్ధి నిమిత్తం చెట్లను తొలగించి రహదారులను విస్తరించడం, భవనాలు నిర్మించడం తదితర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని చరిత్ర పునరావృతమై మళ్ళీ మొక్కలు పెంచేందుకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి వాతావరణ సమతుల్యతకు తోడ్పాటు అందించాలని మంత్రి పేర్కొన్నారు. గతంలో నంద్యాల నుండి ఆళ్లగడ్డ వరకు చెరువు కట్ట నుండి మహానంది వరకు రోడ్లకు ఇరువైపులా పెద్ద పెద్ద వృక్షాలు ఉండేవని రహదారి విస్తరణలో చెట్లన్నటిని తొలగించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. వాటి స్థానంలో మళ్లీ మొక్కలు పెంచి మహావృత్యాలుగా పెరిగేంతవరకు సమర్పించాల్సిన బాధ్యత తీసుకోవాలని మంత్రి అధికారులను సూచించారు. పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమానికి అనుబంధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల మూడవ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛంద కార్యక్రమాన్ని చేపట్టి ప్రతి ఒక్కరూ పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టడంతో పాటు మొక్కలు పెంచేందుకు ఉత్సాహం చూపాలని మంత్రి సూచించారు. చెట్లే మానవుని మనుగడకు ఆధారమని... రాష్ట్రవ్యాప్తంగా కోటి మొక్కలు నాటేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని ఈ కార్యక్రమంలో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొని మొక్కలు నాటడంతోపాటు సంరక్షించే బాధ్యత తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వన మహోత్సవ కార్యక్రమ సందర్భంగా రాష్ట్రమంతటా కోటి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు నాంది పలకాలన్నారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా నాలుగు లక్షల మొక్కలు నాటడానికి శాఖల వారీగా పక్కా ప్రణాళిక రూపొందించుకుని ఆ మేరకు మొక్కలు నాటడమే కాకుండా వాటి పరిరక్షణ బాధ్యత కూడా చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఉపాధి హామీ పథకం, ఉద్యానవనం, అటవీ శాఖ అధికారుల ద్వారా అవెన్యూ, బ్లాక్, బండ్ ప్లాంటేషన్ తో పాటు ఇతర ఖాళీ ప్రదేశాలు ఉన్న చోట మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అటవీ శాఖ, ఉపాధి హామీ నర్సరీలలో వివిధ రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయని, మొక్కలు నాటాలనుకునే వారికి అటవీ శాఖ నర్సరీ వారు ఉచితంగానే ఇవ్వడం జరుగుతుందని సదరు అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని పెద్ద ఎత్తున మొక్కల పెంపకంలో భాగస్వామ్యం కావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. చెట్లు తొలగించడం వల్ల వాతావరణ సమతుల్యత దెబ్బతిని అధిక ఉష్ణోగ్రతలు పెరగడం, వేడి గాలుల వల్ల త్వరగా అలసిపోయి శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మన్నారు. అలాకాకుండా ఆనందకరమైన జీవితాన్ని పొందాలంటే మొక్కలు నాటడంతో పాటు బాధ్యతగా వాటికి అవసరమైన పోషకాలు ఇవ్వడం ద్వారా భవిష్యత్తులో మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అదే విధంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా "ప్లాస్టిక్ నిషేధం" పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చెత్తతో పాటు ప్లాస్టిక్ ను తగలబెట్టడం ద్వారా విడుదలయ్యే వాయువుల వల్ల అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అదే విధంగా ముగ జీవాలు ఆహార అన్వేషణ సమయంలో ఆహారంతో పాటు ప్లాస్టిక్ ను తినడం ద్వారా అనారోగ్యం బారిన పడే అవకాశం వుందన్నారు. అందుకుముందుగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేలా ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్లాస్టిక్ వాడకం మానవుల జీవనశైలిలో భాగం అవ్వడం వల్ల క్రమ క్రమంగా వాటి వాడకాన్ని తగ్గించడానికి ప్రజలు సహకరిస్తే భవిష్యత్తు తరాలకు ఎంతో స్వచ్ఛమైన గాలి, ఆహారం ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. అదే విధంగా పంట పొలాల్లో అధిక శాతం రసాయనాలు వాడడం వల్ల భూసారం తగ్గుతుందని అలా కాకుండా ప్రకృతి సహజసిద్ధమైన ఎరువులు వాడడం ద్వారా భూసారం పెరిగే అవకాశం ఉంటుందన్నారు. అంతకు ముందు ఫారెస్ట్ కన్జర్వేటర్ కృష్ణమూర్తి, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మంజునాథ్, ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి, డిఇఓ జనార్దన్ రెడ్డి తదితరులు మొక్కల పెంపకం, చెట్ల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. నారాయణ కళాజాత బృందం వారి కళారూపం, గురురాజ స్కూల్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎన్సిసి విద్యార్థులు, పట్టణ స్వయం సహాయక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## తిరుమలలో పచ్చదనాన్ని 80 శాతానికి పెంచేందుకు చర్యలు : టీటీడీ అదనపు ఈవో

**తిరుమల పెన్ పవర్ జూన్ 5 :** పర్యావరణ పరిరక్షణలో భాగంగా తిరుమలలో పచ్చదనాన్ని 80 శాతం పెంచేందుకు చర్యలు చేపట్టామని టీటీడీ అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి తెలియజేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుమలలోని గోగర్భం డ్యామ్ కు సమీపంలోని ఆక్టోపస్ భవనం వద్ద గురువారం ఉదయం ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో రెండు వేల మొక్కలు నాటుతున్నామని చెప్పారు. తిరుమలలో ఇప్పటికే ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తున్నప్పటికీ పూర్తిగా ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు పగడ్బందీగా ప్రణాళికలు అమలు చేస్తున్నామన్నారు. భక్తులు వాహనాల ద్వారా తీసుకొస్తున్న ప్లాస్టిక్ ను కారు విండోల ద్వారా ఘాట్ రోడ్లలో విసురుతున్నారని, దీని ద్వారా ప్లాస్టిక్ అధికంగా పేరుకుపోతుండటంతో అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద ప్లాస్టిక్ ను నియంత్రిస్తున్నామన్నారు.



భక్తులకు కూడా వాహనాల్లో నుండి రోడ్డుపై ప్లాస్టిక్ విసరకూడదని అవగాహన కల్పిస్తున్నామన్నారు. తిరుమలలో ప్రతి చెట్టుకు ప్రాధన్యత ఉందని, విదేశీ మొక్కలు నాటడం ద్వారా స్వదేశీ చెట్లకు హాని కలుగు తుందని చెప్పారు. అందులో భాగంగా పూర్తిస్థాయిలో పరిశోధన చేసి 40 స్థానిక మొక్క జాతులు ను గుర్తించి తిరుమలలో నాటుతున్నామని చెప్పారు. త్వరలో అటవీశాఖ సహకారంతో రెండు లక్షల మొక్కలను నాటుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు శ్రీనివాసులు, డిప్యూటీ ఈవో సోమన్నారాయణ, ఈఈ సుధాకర్, ఎఫ్వార్వో దొరస్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం.. ప్లాస్టిక్ అంతం...

**తిరుపతి పెన్ పవర్ జూన్ 05 :** ప్రపంచ .పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం పై తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నందు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ బాలకృష్ణ నాయక్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, తిరుపతి వారి ఆదేశానుసారం నిర్వహించారు. ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవం థీమ్‌ను "ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడంపై". చబీట్ ప్లాస్టిక్ పొల్యూషన్ అనే ప్రచారంతో ప్లాస్టిక్ కాలుష్యాన్ని ఎదుర్కోవడం పైనే దృష్టి పెట్టి పర్యావరణాన్ని కాపాడేందుకు, సంరక్షించేందుకు ప్రతి ఒక్కరి బాధ్యతను గుర్తు చేస్తూ ఏటా జూన్ 5 న జరుపుకునేదే ప్రపంచ పర్యావరణ దినోత్సవం. ఈ ప్రత్యేక రోజున అనేక స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ సంస్థలు పర్యావరణం ప్రాముఖ్యత గురించి తెలిపేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాయి.అయితే ఈ ఏడాది మనం జరుపుకోబోయేది 50వ వార్షికోత్సవం. ఈ రోజున ప్రపంచ దేశాలన్నీ పర్యావరణం గురించి మాట్లాడుతాయి. భూమికి కలుగుతున్న రకరకాల కాలుష్యాలను ఎలా తగ్గించాలో చర్చిస్తాయి.ఏం చెయ్యాలో ఆలోచించి తీర్మానాలుచేసి అవగాహనా కార్యక్రమాలు కూడా జరుపుతాయి. మరి నిజంగానే మనం భూమిని కాపాడుతున్నామా? అంటే లేదు అన్నదే సమాధానం.వాతావరణ కాలుష్యం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి ముఖ్యంగా కలుషిత మైన గాలి పీల్చడం వల్ల ఊపిరితిత్తుల సమస్యలు,చర్మ వ్యాధులు మొదలగునవి వస్తాయి.ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మాట్లాడుతూ వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రకారం ప్రపంచంలో 90 శాతం జనాభా పీల్చే గాలి కాలుష్యమైపోయిందని, దీంట్లో ప్రాణాంతక వాయువులు,ఇతర కణాలు ఉంటాయని, ఇవి మన ఊపిరితిత్తులకు చాలా అపాయకరమని, ఎప్పుడైనా కాలుష్యమైన గాలిని పీలిస్తే.. మనకు శ్వాస సంబంధిత వ్యాధులు వస్తాయని పేర్కొన్నారు.దీంతో శ్వాస తీసుకోవడానికి ఇబ్బందులు వస్తాయి. దగ్గు,ముక్కు కారడం, అస్మా,ఛాతినొప్పి కూడా వస్తుందని, రానురాను ఆరోగ్య పరిస్థితి మరింత దారుణంగా మారి గుండె, మెదడు,చర్మం ఇతర ముఖ్యమైన భాగాలపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు.ఈ కార్యక్రమం లో డాక్టర్ శ్రీనివాసరావ్ డి పి ఎమ్ ఓ, డాక్టర్ మురళి కృష్ణ డిప్యూటి డి ఎమ్ హెచ్ ఓ, డాక్టర్ ఛత్ర ప్రకాష్ రెడ్డి ఇంచార్జ్ డి ఐ ఓ ఇతర ప్రోగ్రామ్ ఆఫీసర్స్ జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయ సిబ్బంది పాల్గొని పర్యావరణ రక్షణకై తమ వంతు కృషి చేస్తాము అని ప్రతిజ్ఞ చేయడం జరిగింది.

## పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

### ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి: చిత్తూరు ఎంఎల్‌ఏ



**చిత్తూరు, పెన్ పవర్ జూన్ 05 :** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని చిత్తూరు ఎం ఎల్ ఏ గురజాల జగన్ మోహన్ తెలిపారు.గురువారం చిత్తూరు ఫారెస్ట్ వెస్ట్ రేంజ్ కు సంబంధించి మురకంబట్టు సమీపంలో గల నీవా నగరవనంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం మరియు వన మహోత్సవం-2025 కార్యక్రమానికి డి ఎఫ్ ఓ భరణి తో కలసి చిత్తూరు ఎం ఎల్ఏ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా రహదారి పక్కన మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా అధికారులు, మహిళలు, విద్యార్థులతో ఎం ఎల్ ఏ ప్రపంచ పర్యావరణ దినోత్సవం మరియు వన మహోత్సవం-2025 ప్రతిజ్ఞ చేయించారు. చిత్తూరు ఎం ఎల్ ఏ మాట్లాడుతూ ఆకుపచ్చని ఆశయాలతో స్వచ్ఛ హరితాంధ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని తెలిపారు. నిత్యావసర వస్తువులలో ప్లాస్టిక్ ఒక భాగం అయిపోయిందని, ఉదయం నిద్ర లేచిన మొదలు పాల పాకెట్ ల నుండి ప్లాస్టిక్ వాడకం మొదలవుతున్నదన్నారు. పర్యావరణాన్ని కాపాడడానికి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కోరారు. పర్యావరణ సమతుల్యానికి మొక్కలు నాటడం అవసరమని, చెట్లను నరికివేయడం ద్వారా వాతావరణంలో మార్పులు సంభవించి అకాల వర్షాలు, ఎండలు అధికంగా ఉంటున్నాయన్నారు. వాతావరణంలో మార్పులు రావడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. పంట భూములలో అధికంగా ఎరువులు, క్రిమి సంహారకాలను వాడడం ద్వారా కూడా భూమి కలుషితం అవుతున్నదని, కలుషిత ఆహారం తినడం ద్వారా అనారోగ్యం వస్తుందన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం మరియు వన మహోత్సవం-2025లో భాగంగా ప్రతి విద్యార్థి తమ పాఠశాల మరియు కళాశాలలో మొక్కలను నాటాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ్ భారత్ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణాన్ని అందించడం కోసం, స్వచ్ఛమైన వాతావరణంలో జీవించడం కోసం మొక్కలు విరివిగా పెంచాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు ఇంటి వద్ద చెట్లు నాటి పెంచాలన్నారు. డిఎఫ్ఓ భరణి మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం మరియు వన మహోత్సవం-2025లో భాగంగా వర్షాకాలం ప్రారంభమయ్యే సమయానికి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో 30 లక్షల మొక్కలు నాటడం ప్రధాన లక్ష్యంగా జిల్లా అటవీ శాఖ పని చేస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలని కోరారు. ప్లాస్టిక్ వాడకం వలన భూ కాలుష్యం పెరుగుతున్నదన్నారు. ప్లాస్టిక్ తో పాటు ఒక్కసారి వాడి పడేసే వస్తువుల వినియోగం తగ్గించడం ద్వారా భూ కాలుష్యం తగ్గుతుందని, పర్యావరణాన్ని రక్షించవచ్చన్నారు.ఈ కార్యక్రమం లో డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు,ఆర్ వి ఎస్ కాలేజీ విద్యార్థులు,రెయిన్ బో ఇంటర్నేషనల్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఏఎల్‌సిఎం హైస్కూల్ గ్రౌండ్‌లో మొక్కలు నాటిన మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం



**నాయుడుపేట, పెన్ పవర్ ప్రతినిధి, జూన్ 5 :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం నాయుడుపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఏఎల్‌సిఎం హైస్కూల్ ఆటస్థలంలో జరిగిన పర్యా వరణ దినోత్సవం కార్యక్రమంలో మాజీ ఎంపీ,సూళ్లూరుపేట నియోజక వర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం పాల్గొని మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా,మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ రఫీ,పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు పోట్లపూడి రాజేష్, కరీం భాయి చెంచయ్య, మైలారి రాజశేఖర్,మొండెం బాబు, గూడూరు సుధీర్ రెడ్డి,అవధానం సుధీర్, పలువురు నాయకులు, మెప్మా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## లంచం తీసుకొని కూడా పని చేయని విద్యుత్ అధికారులు?



**పలమనేరు జూన్ :05(పెన్ పవర్) :** నియోజక వర్గము నందు బైరెడ్డిపల్లె మండల పరిధిలోని ధర్మపురి పంచాయతీ మరిమానుచేన్లు గ్రామానికి చెందిన పలని, రవి,జై చంద్ర,కన్నయ్య అనే నలుగురు రైతులకు రెక్కాడితే కానీ డొక్కాడనటువంటి పరిస్థితి వీరిది. అటువంటి నలుగురికి కలిపి కరెంటు ట్రాన్స్ఫారం ఒకటే ఉండేది.రెండు సంవత్సరాల ముందు ట్రాన్స్ఫారం కాలి పోయింది. ప్రతిసారి ట్రాన్స్ఫారం కాలి పోతున్నది కాబట్టి ఇద్దరిద్దరికీ ఒక ట్రాన్స్ఫారం వేసుకోవాలని అప్పటి కరెంటు డిపార్ట్మెంట్ ఏఇ సలహా ఇవ్వడంతో, నలుగురు కలిసి 1లక్షా 10వేల రూపాయలు సంబంధిత ఏయికి ముట్టచెప్పారు. అప్పటినుండి పాత ట్రాన్స్ఫారంను జై చంద్ర, కన్నయ్యలు వాడుకుంటున్నారు.మిగిలిన పలని,రవి లకు గాను కొత్త ట్రాన్స్ఫారం బిగించాల్సి ఉన్నది,అయితే ఏఈ వేరే ప్రదేశానికి బదిలీ అవ్వడం జరిగినది. అప్పటినుండి సంబంధిత ఇరువురి రైతుల పరిస్థితి దయనీయంగా తయారయింది. ఫోన్ చేస్తే ఫోన్ తీయరు దగ్గరికి వెళితే పలకరించడు.ఆ ఉద్యోగి ఉన్న ప్రదేశానికి వెళ్లినా గాని ఆయన వీరిపై కనికరించలేదు, కాళ్ళ వేళ్ళ పట్టుకోగా పలమనేరుకు పిలిపించి ఒక ట్రాన్స్ఫారంను ఆరు నెలలకు ముందు ఇచ్చి పంపంచారు. తర్వాత కార్యక్రమం యధాతధంగా సాగుతూనే ఉన్నది గాని వీరికి మాత్రం ట్రాన్స్ఫారం బిగించలేదు. ప్రస్తుతం మండల కేంద్రంలో పనిచేస్తున్న కరెంట్ అధికారులను ఎంత ప్రాధేయపడినా కనికరం చూపించ లేదు. ఎవరి దగ్గర డబ్బులు ఇచ్చావో ఆయన దగ్గరే పని చేయించుకో మాకు సంబంధం లేదని చెప్తున్నట్లు బాధితులు వాపోతున్నారు.రెండు సంవత్సరాల నుండి తమకు ఉన్న ఆవులను అమ్ముకోవడం జరిగినది,చేసేదానికి పని లేక వారి పిల్లలు బెంగళూరుకు వలసలు వెళ్లాల్సి వచ్చింది,కానీ సంబంధిత ఏఈ మాత్రం చెన్నై నగరంలో నాలుగు కోట్ల ఇల్లు కడుతున్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలుస్తున్నది.ఇప్పటికైనా కనికరం చూపాలని ట్రాన్స్ఫారం బిగించాలని ప్రస్తుతం ఉన్న మండల కేంద్రంలోని ఏఈ ప్రసాద్ గారిని కోరడంతో వైర్లు బిగించడానికి 14 వేల రూపాయలు ఇచ్చినట్లయితే బిగిస్తామని ఇప్పుడు ఉన్న వారు తెలపడంతో ఆ డబ్బు సర్దుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. వయసు పెరిగి ముసలి వాళ్ళయినా గాని వీరికి రైతులుగా ఉండడమే ఇష్టం కాబోలు అందుకే పట్టువదలని విక్రమార్కుడు లాగా ట్రాన్స్ఫారం కోసం పాకులాడుతున్నారు. మరి పండించే పంట వీరు తినడానికా లేక అందరికీ తినిపించడానికో అర్థం కావడం లేదు,చనిపోయే ముందైనా వీరికి ట్రాన్స్ఫారం బిగించినట్లయితే వీరి ఆత్మ శాంతిస్తుందని సంబంధిత రైతు పలని తెలియజేస్తున్నాడు.మరి వీరి కోరిక నెరవేరు తుందో లేదో వేచి చూడాల్సి ఉన్నది. ఈ రైతులకు ఇటువంటి విపత్కర పరిస్థితుల నుండి తప్పించడానికి ఏ నాయకుడు ముందుకు రాలేదు.ఎవరైనా దయా హృదయం ఉన్నట్లయితే వీళ్ళ గోడును పట్టించుకొని వీళ్లకు ట్రాన్స్ఫారం బిగించడంలో సహాయ సహకారాలు అందించాలని వారు ప్రాధేయ పడుతున్నారు.

## పంట పొలాలకు పిచికారీ చేసే డ్రోన్ పరికరం వాడకం విధానాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్



**శ్రీ కాళహస్తి , పెన్ పవర్ జూన్ 5 :** డ్రోన్ల వినియోగం ద్వారా రైతుల ఖర్చు తగ్గించడం సమయం ఆదా అవుతుందని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం శ్రీకాళహస్తి నియోజకవర్గం లోని సహాయ వ్యవసాయ శాఖ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆర్డీఓ భాను ప్రకాష్ రెడ్డితో కలిసి పంట పొలాలకు పిచికారీ చేసే డ్రోన్ పరికరం వాడకం విధానాన్ని గురించి తెలుసుకొని పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయంలో డ్రోన్ల ఉపయోగించి రైతులు ఖర్చు తగ్గించడం, సమయం ఆదా చేయడం వంటి ఉపయోగాలు ఉంటాయని తెలిపారు. సమయం ఆదా చేయడం ద్వారా తమ ఆదాయాన్ని పెంచుకోవచ్చని సాంప్రదాయ పద్ధతిలో పురుగుమందుల పిచికారి చేయడం వల్ల ఆరోగ్యం పై ప్రభావం చూపుతోందని డ్రోన్ల వాడకంలో దీని నివారించవచ్చు అని తెలిపారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగాన్ని గురించి ప్రతి రైతుకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత వ్యవసాయ అధికారులు సుధాకర్ రెడ్డి, భారతి తదితరులు పాల్గొన్నారు.

## నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవస్య విద్యాలయ.... పర్యావరణ పరిరక్షణలో : చైర్మన్ శివారెడ్డి , సెక్రటరీ సువర్ణ







**కడప పెన్ పవర్ జూన్ 5 :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2025 సందర్భంగా మన JSOS Organization, కడప విద్యార్థులు యోగి వేమన విశ్వవిద్యాలయం, కడపలో నిర్వహించిన పర్యావరణ దినోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఇటువంటి మొక్కలు నాటే కార్యక్రమాల్లో పాల్గొంటే బ్రైటర్ మైండ్స్ విద్యార్థులుగా, నేల తల్లికి మొక్కలతో సంబంధం కలిగి ఉండడం వలన ఆధ్యాత్మిక విలువలతో విద్యార్థులకు మంచి నైపుణ్యము, మొక్కలు ఎడల మంచి అవగాహన, ఉపయోగాలు ఉన్నాయని ప్రత్యక్షంగా తెలుసుకుంటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవశ్య విద్యార్థులు సేవా విభాగంలో అన్నివేళలా ముందుంటారని సెక్రటరీ సువర్ణ వివరించారు. మన ముఖ్యమంత్రి ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలలో భాగముగా కడపలో యోగి వేమన విశ్వవిద్యాలయంలో మొక్కలు నాటే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ చెరుకూరు శ్రీధర్, జిల్లా ఫారెస్ట్ అధికారి వినీత్ కుమార్ మరియు ఫారెస్ట్ అధికారుల, యోగి వేమన సిబ్బంది ఆధ్వర్యంలో మంచి బృహత్కర మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనుట మంచి అనుభూతి కలిగినదని విద్యార్థులు కొనియాడారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ హాజరవడం విశేషం. మన విద్యార్థులకు ఇది ఒక అనుభూతి రాహిత్యమైన, శిక్షణాత్మకమైన అనుభవం అయింది. పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన పెంచుకుని, భవిష్యత్తులో బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలనే ఉత్తమ మార్గంలో ఇది ఒక ముందడుగు అయ్యింది. నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవశ్య విద్యార్థులు సేవా కార్యక్రమాలలో, అవగాహన కార్యక్రమాలలో, ఎల్లవేళలా ముందుంటారని చైర్మన్ శివారెడ్డి, ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రీజినల్ డైరెక్టర్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## రోడ్డు ప్రమాదాలు జరిగిన ప్రదేశంలో మరల ప్రమాదం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలి : జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



**కర్నూలు, పెన్ పవర్ జూన్ 05:** రోడ్డు ప్రమాదాలు జరిగిన ప్రదేశంలో మరల ప్రమాదం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఎస్పీ విక్రాంత్ పాటిల్ తో కలిసి కలెక్టర్ డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యాక్సిడెంట్ కేసులను నిర్లక్ష్యంగా తీసుకోకుండా యాక్సిడెంట్ జరిగిన ప్రదేశానికి వెళ్లి, రోడ్డు బాగులేకపోవడం వల్ల యాక్సిడెంట్ జరిగి ఉన్నట్లయితే, మరల ప్రమాదం జరగకుండా వెంటనే మరమ్మతులు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్ అండ్ బి ఎస్ఈ ని ఆదేశించారు... మార్చి, ఏప్రిల్ నెలల్లో జరిగిన యాక్సిడెంట్లకు సంబంధించి కమిటీ, సంబంధిత అధికారులు జారీ చేసిన సూచనలు ఖచ్చితంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నేషనల్ హైవే, ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు.. ఎల్లమ్మ తల్లి గుడి దగ్గర జరుగుతున్న అప్రోచ్ రోడ్డు పనులు నెలలోపు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎన్హెచ్ అధికారులను ఆదేశించారు....పెద్దపాడు నుండి హైదరాబాద్ ఎన్హెచ్ కు లింక్ చేస్తూ ఔటర్ రింగ్ రోడ్ ఏర్పాటు అంశం మాస్టర్ ప్లాన్ లో ఉందని, అందుకు సంబంధించిన పనులు మొదలు పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు.. ఉల్చాల, గాయత్రి ఎస్టేట్ జంక్షన్ అభివృద్ధి పనులలో పురోగతి తీసుకొనిరావాలని కలెక్టర్ కర్నూలు మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారిచే ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగుల అటెండెంట్ ల కోసం అన్ని సౌకర్యాలతో విశ్రమాలయం నిర్మించడానికి ముందుకు వచ్చినా వారికి స్థలాన్ని కేటాయించడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నారని కలెక్టర్ జి జి హెచ్ హాస్పిటల్ ఏవో ను ప్రశ్నించారు.. విశ్రమాలయ పను వెంటనే మొదలుపెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ముందు ఉన్న పండ్ల దుకాణాలకు కూడా హాస్పిటల్ లోపల ఒక స్థలంలో ఏర్పాటు చేసే అంశాన్ని పరిష్కరించాలని కలెక్టర్ కలెక్టర్ జి జి హెచ్ ఏఓ కు సూచించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ కొద్ది రోజుల్లో పాఠశాలలు రీఓపెన్ అవుతున్నాయని, ప్రతి పాఠశాలకు సంబంధించిన బస్సులు, వ్యాన్ల ఫిట్నెస్ ను పరీక్షించాలని, వాటిపై నిఘా పెట్టాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. స్టేట్ హైవే, నేషనల్ హైవే లో స్పీడ్ బ్రేకర్ లు అవసరమైన ప్రాంతాల్లో పరితగతిని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదాల నివారణ పై చాలా వీడియోలు చేశామని, వాటిని నగరంలోని ముఖ్య కూడళ్లలో ప్రదర్శించేందుకు ఒక మొబైల్ వాహనాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ ను కోరారు... అలాగే నాణ్యత కలిగిన బ్రీత్ అనలైజర్ లను కూడా ఏర్పాటు చేయాలని ఎస్పీ కోరారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి , కర్నూల్ మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, పంచాయతీ రాజ్ ఈఈ మద్దన్న , ఆర్టీవో భరత్ చౌహాన్, అడిషనల్ డీఎంహెచ్వో భాస్కర్, డిసిహెచ్ శ్రీనివాస రావు , జి జి హెచ్ ఏవో సింధు సుబ్రహ్మణ్యం ,నేషనల్ హైవే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణంపై అవగాహన...





**నంద్యాల, పెన్ పవర్ జూన్ 05 :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారి ఆధ్వర్యంలో నంద్యాల పట్టణ మున్సిపల్ కార్యాలయం నుండి పద్మావతి నగర్‌లోని ఇండోర్ స్టేడియం వరకు పరిశ్రమలు, ప్రభుత్వ శాఖలు, ప్రజాప్రతినిధులు మరియు పౌరులతో కలిసి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగించే ఉద్దేశంతో భారీ ర్యాలీ నిర్వహించబడింది. ఈ ర్యాలీ అనంతరం ఇండోర్ స్టేడియం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ సహాయ కమిషనర్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్, ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అసిస్టెంట్ ఇంజనీర్, గనుల శాఖ సహాయ సంచాలకులు పాల్గొని పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకత, ప్రజల పాత్ర, తీసుకోవలసిన చర్యలపై ప్రసంగించారు. కార్యక్రమంలో JSW సిమెంట్స్, రామ సిమెంట్స్, SPY ఆగ్రో కెమికల్స్, ప్రైవేట్ ఆసుపత్రులు తదితర సంస్థలు పాల్గొని ర్యాలీ మరియు మొక్కల నాటే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో తమ పాత్రను పోషించాయి.

## పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలి : జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల, పెన్ పవర్ జూన్, 05 :** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావడం వల్ల పర్యావరణానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్, ప్రొహిబేషన్ మరియు ఎక్సైజ్ శాఖ ఆవరణంలో జిల్లా కలెక్టర్ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, డిఆర్ఓ రాము నాయక్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు గాను పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగా కలెక్టరేట్, ప్రొహిబేషన్ మరియు ఎక్సైజ్ శాఖ ఆవరణంలో సుమారుగా 120 మొక్కలు నాటడం జరిగిందన్నారు. మొక్కలు నాటి అక్కడితో వదిలేయకుండా రోజు వాటికి కొంత సమయం కేటాయించి వాటికి నీరు అందించడం ద్వారా భవిష్యత్తులో మంచి నీడనిచ్చి ప్రాణవాయువును కల్పిస్తుందన్నారు. 76వ వన మహోత్సవం సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపడుతున్నట్టు కలెక్టర్ తెలిపారు. ఈ సంవత్సరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం యొక్క థీమ్ 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం' ద్వారా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించే అవకాశం ఉంటుందన్నారు.

## స్నేహమంటే భరోసా.... స్నేహమంటే సహాయం.... అని నిరూపించిన జడ్పీ బాయ్స్ స్కూల్ పూర్వ విద్యార్థులు



**శ్రీకాళహస్తి/ పెన్ పవర్/ ప్రతినిధి/ జూన్ 5 :** గత వారంలో శ్రీకాళహస్తి పట్నంలోని సీనియర్ వార్త విలేఖరి మెహర్ కుమార్ చనిపోయారు అని అందరికి తెలిసిందే. దీనిలో భాగంగా శ్రీకాళహస్తి జడ్పీ బాయ్స్ స్కూల్ పూర్వ విద్యార్థుల సహకారంతో సుమారు 90000/- (అక్షరాల సుమారు తొంబైవెలు) వాళ్ళ తల్లి గారికి ఈరోజు అందించారు. అలాగే తల్లి మెహర్ స్నేహితులంతా భరోసానికి అందించి, మున్ముందు మీకే సహాయ సహకార కావాన్న అందిస్తామని తెలిపారు.

## ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలి.. పర్యావరణాన్ని కాపాడాలి-మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం



**నాయుడుపేట, పెన్ పవర్ ప్రతినిధి, జూన్ 5 :** భావి భారత పౌరులు ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి పర్యావరణాన్ని కాపాడాలని మాజీ ఎంపీ,సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం నాయుడుపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఏ ఎల్ సి ఎం హై స్కూల్ ఆటస్థలంలో జరిగిన పర్యావరణ దినోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మొక్కలు నాటారు. అనంతరం నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పర్యావరణ దినోత్సవంలో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నాటిన మొక్కలను మెప్మా సభ్యులు, మున్సిపల్ సిబ్బంది నీరు పోసి పరిరక్షించాలని సూచించారు. మొక్కల పెరిగి చెట్లు అయితే ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా,మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ రఫీ,పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు మైలారి రాజశేఖర్,మొండెం బాబు, గూడూరు సుధీర్ రెడ్డి,అవధానం సుధీర్, పలువురు నాయకులు, మెప్మా సిబ్బంది,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# పర్యావరణ రక్షణ మనందరి బాధ్యత

## జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



**కర్నూలు, పెన్ పవర్ జూన్ 05 :** మొక్కలు నాటుదాం, పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పిలుపునిచ్చారు. గురువారం కర్నూలు నగర శివార్లలోని గార్గేయపురం నగరవనంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వానమహోత్సవం - 2025 కార్యక్రమంలో భాగంగా మ్నొక్కలు నాటి, అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా గారు, పత్తికొండ ఎమ్మెల్యే కె.ఈ.శ్యాంబాబు గారు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 1972 సంవత్సరం జూన్ 5 వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవంగా డిక్లేర్ చేసినప్పటి నుండి ప్రతి సంవత్సరం జూన్ 5 వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు.... పర్యావరణ పరిరక్షణ లో భాగంగా ప్రతి సంవత్సరం ఒక థీమ్ ను నిర్దేశించుకుని, ఆ థీమ్ ను అమలు చేయడం జరుగుతోందన్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది "ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం" అనే థీమ్ తో పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. ప్లాస్టిక్ ను మనం మన దినచర్యలో బాగా ఉపయోగిస్తున్నామని, నియంత్రణ లేకుండా ఎక్కువగా ఉపయోగించడం వల్ల మానవ జాతికి, పర్యావరణానికి సమస్యలు ఏర్పడతున్నాయన్నారు. ప్లాస్టిక్ ఉపయోగించి పడేసిన తర్వాత అది విచ్ఛిన్నం కాదని, భూమి కింద అలాగే ఉండిపోతుందన్నారు.. దీని వల్ల వర్షం పడినప్పుడు వర్షపు నీరు కింది భూమిలోకి పోదని, తద్వారా గ్రౌండ్ వాటర్ పెరగదన్నారు. ఈ విధంగా కొన్ని లక్షల మంది, కోట్ల మంది ప్లాస్టిక్ ఉపయోగించి పడేస్తూ ఉన్నారని, ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను దృష్టిలో ఉంచుకొని ప్లాస్టిక్ ను ఉపయోగించకుండా బంద్ చేయాలన్నారు. చెట్లు లేకపోతే మానవ మనుగడ ఉండదన్నారు.. భవిష్యత్ తరాలకు కాలుష్యం లేని వాతావరణం అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు.. అందువల్ల ప్రతి ఒక్కరూ వీలైనన్ని మొక్కలు నాటాలన్నారు.. పర్యావరణ రక్షణ మనందరి బాధ్యత అన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ప్లాస్టిక్ ను ఎంత తక్కువగా మనం ఉపయోగిస్తే అంత మంచిదన్నారు.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే మన జీవనశైలిని పర్యావరణాన్ని పరిరక్షించుకునే విధంగా మార్చుకోవాలని సూచించారు. మొక్కలు నాటడం వల్ల స్వచ్ఛమైన గాలి లభిస్తుందని, కాలుష్యాన్ని తగ్గించగలుగుతామని, తద్వారా సకాలంలో వర్షాలు పడి రైతులు సుభిక్షంగా ఉంటారన్నారు. పత్తికొండ ఎంఎల్ఏ కే.ఈ.శ్యామ్ కుమార్ మాట్లాడుతూ వాతావరణం బాగుంటే ఆరోగ్యాలు బాగుంటాయన్నారు.. మన జిల్లాలో పరిశ్రమలు ఉన్నాయని, సంబంధిత పరిశ్రమలకు పొల్యూషన్ కంట్రోల్ స్ట్రిక్ట్ నార్మ్స్ తీసుకొని రావాలన్నారు.. జిల్లాలో ఉన్న ప్రతి పాఠశాలలో మొక్కలు నాటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా పిల్లలకు వాటి ప్రాధాన్యత తెలుస్తుందన్నారు. ప్రతి ఒక్కరు వారి వారి ఇళ్ల వద్ద చెట్లు పెంచాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా పర్యావరణాన్ని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యేలు, అధికారులు నగరవనంలో మొక్కలు నాటారు..అనంతరం చిల్డ్రన్ పార్క్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఆర్డీఓ సందీప్, డిఎఫ్ఓ శ్యామల, ఫ్లయింగ్ స్క్వాడ్ డిఎఫ్ఓ రవిశంకర్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాబు, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, మెప్మా పిడి నాగశివ లీలా, టూరిజం అధికారి విజయ, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఏపిఎమ్ఐపి పిడి ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణమే భావితరాల భవిష్యత్తు : బొజ్జల బృందమ్మ...



**శ్రీకాళహస్తి/ పెన్ పవర్/ ప్రతినిధి /జూన్ 5 :** శ్రీకాళహస్తి పట్టణం లోని 34 వ వార్డులో తెలుగుదేశం పార్టీ నాయకులు గాండ్ల తెలికుల బిసి సాధికార సమితి రాష్ట్ర సభ్యులు కన్నావరం హరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కల పంపిణీ కార్యక్రమానికి విశిష్ట ముఖ్య అతిథులుగా విచ్చేసిన శ్రీకాళహస్తి శాసనసభ్యులైనటువంటి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి గారి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ గారు పాల్గొనడం జరిగినది... బొజ్జల బృందమ్మ గారు మాట్లాడుతూ... పర్యావరణమే భావితరాల భవిష్యత్తు అని గ్లోబల్ వార్మింగ్ కారణంగా కాలుష్యం విపరీతంగా పెరుగుతుందని బృందమ్మ ఆందోళన వ్యక్తం చేశారు.పర్యావరణంలో పెను మార్పులు వస్తున్నాయి దీనివలన ఎప్పుడంటే అప్పుడు వర్షాలు పడుతున్నాయని.అందుకే పిల్లల భవిష్యత్తును కాపాడేందుకు మొక్కల పెంపకం పై చిన్నప్పటి నుంచే అవగాహన పెంచాలన్నారు... ఈ యొక్క కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు గాలి చలపతి నాయుడు,డాక్టర్ గుమ్మడిపూడి,దశరథ ఆచారి, పార్లమెంట్ రైతు ఉపాధ్యక్షులు ప్రకాష్ నాయుడు, తొట్టంబేడు మాజీ మండల అధ్యక్షులు గాలి మురళి నాయుడు,పేట బాలాజీ రెడ్డి,మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్,బిసి సెల్ అధ్యక్షులు పోలూరు శ్రీనివాసులు రెడ్డి,కాళ్ళప్ప రెడ్డి, ఎమ్మెస్ రెడ్డి,నాగరాజు రెడ్డి,ఆర్ముగం,మురళి రెడ్డి,వజ్రం కిషోర్,వెంకటేష్ ప్రకాష్,ముని రాజా యాదవ్ తదితరులు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొనడం జరిగినది.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా..

## మొక్కలు నాటిన మాజీ ఎమ్మెల్యే ఎస్‌సివి నాయుడు



**శ్రీకాళహస్తి/ పెన్ పవర్/ ప్రతినిధి /జూన్ 5 :** శ్రీకాళహస్తి పట్టణంలో గోపాల వనంలో మాజీ శాసనసభ్యులు ఎస్సీవి నాయుడు ఆధ్వర్యంలో తమ నాయకులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు, అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే తనయుడు టిడిపి యువ నాయకుడు ఎస్ సి వి దిలీప్ చేతుల మీదుగా పలుచోట్ల మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ వి కిరణ్, గోగినేని భాస్కర్ నాయుడు, జానకిరామ నాయుడు, గోపి నాయుడు,సుబ్రహ్మణ్యం సుదర్శన్ నాయుడు, ఢిల్లీ ప్రతాప్, కయ్యూరి శివ, మధు, గాలి సుబ్రహ్మణ్యం,పసల బాబు పాల్గొన్నారు.

# ఇసుక ఫిల్టర్ చేసే గోతులే చిన్నారుల ప్రాణాలు తీశాయి!









**చిత్తూరు జిల్లా.. పలమనేరు జూన్ 5,(పెన్ పవర్) :** ఇసుక ఫిల్టర్ చేసి అక్రమ రవాణా చేయడానికి తవ్విన గుంతలే పలమనేరు నియోజకవర్గం వి.కోట మండలంలో ముగ్గురు చిన్నారులను బలి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇందులో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు పిల్లలు చనిపోవడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు కమ్ముకున్నాయి. చెరువులో తీసిన గోతులు లోతు ఎక్కువగా ఉండటం,ఈతకు వెళ్లిన పిల్లలకు ఈత రాకపోవడంతో ముగ్గురు పిల్లలు మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈ విషయమై జిల్లా ఇన్చార్జ్ మంత్రి మండి రాంప్రసాద్ రెడ్డి,పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. వి.కోట మండలం మోట్లపల్లికి చెందిన మృతుల కుటుంబాలు కూలి చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారు.రెడ్డప్ప, చంద్రకళ కుమారుడైన కుశాల్ 9వ తరగతి చదువుతున్నాడు.ఇతని వయసు 14 సంవత్స రాలు. చంద్రశేఖర్, కవితల కుమారుడు నిఖిల్. 8వ తరగతి చదువు తున్నాడు. ఇతని వయసు 13 సంవత్సరాలు. ఆదెప్ప,బేబీల కుమా రుడు జగన్ మూడవ తరగతి చదువుతున్నాడు.ఇతని వయసు ఎనిమిది సంవత్సరాలు. గురువారం ఉదయం వీరి తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లారు. వీరు చెరువులో స్నానం చేయడానికి ముగ్గురు మాట్లాడుకుని బయలు దేరారు. గ్రామం పక్కనే ఉన్న చెరువులో స్నానం చేయడానికి ఉపక్రమించారు. చెరువులో గోతులు ఎక్కువ లోతు ఉండడంతో, వీరికి ఈత రాకపోవడంతో ముగ్గురు చిన్నారులు మృత్యువు పాలైనట్లు తెలుస్తోంది.ఈ చెరువులో శ్రీరాములు రెడ్డి అనే అతను ఇసుకను ఫిల్టర్ చేసి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకుగాను లోతుగా గోతులు తీయడంతో ముగ్గురు చిన్నారులు అందులో అసువులు బాసినట్లు సమాచారం.ఈ విషయం తెలియగానే జిల్లా ఇన్చార్జి మంత్రి రాంప్రసాద్ రెడ్డి మృతుల కుటుంబాలను ఫోన్ ద్వారా పరామర్శించారు. అలాగే పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి కూడా మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ వార్త తెలియగానే తాను తీవ్ర దిగ్భ్రాంతికి గురైనట్లు తెలిపారు. ఇటువంటి సంఘటన కాకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. మృతులు నిఖిల్, జగన్ ఒకే కుటుంబానికి చెందిన వారుగా సమాచారం. నిఖిల్ తండ్రి చంద్రశేఖర్,జగన్ తల్లి బేబీ స్వయానా అన్నా చెల్లెలు.ఇలా ఒకే కుటుంబానికి చెందిన ఇరువురు చిన్నారులు మృతి చెందడంతో ఆ కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి.

# వైవియూ ప్రాంగణంలో ఘనంగా ప్రపంచ పర్యావరణ...

## డిఎఫ్ఓతో కలిసి మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్



**కడప, పెన్ పవర్ జూన్ 5 :** మొక్కలను పెంచి పచ్చదనాన్ని పంచే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగానే కాకుండా.. వ్యక్తిగత బాధ్యతగా స్వీకరించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. "హరిత ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో భాగంగా జూన్ 5వ తేదీ నుండి జర్తీక మాసం వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వన మహోత్స వాన్ని గురువారం యోగివేమన యూనివర్సిటీ ప్రాంగణంలో శ్రీకారం చుట్టడం జరిగింది. జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వనమహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, గౌరవ అతిథులుగా డిఎఫ్ఓ వినీత్ కుమార్ (టెరిటోరియల్), డిఎఫ్ఓ (సామాజిక వన్య అటవీ సంరక్షణ), కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, వైవియూ రిజిస్ట్రార్ పద్మ, డ్వామా పీడి అదిశేషారెడ్డి, డిపివో రాజ్యలక్ష్మిలు హాజరై.. వారి పేర్లతో కేటాయించిన స్థలంలో అడవి జాతి మొక్కలు నాటి 'హరి తాంధ్ర ప్రదేశ్' లక్ష్య సాధనకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో.. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ స్వచ్ఛందంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ యజ్ఞంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రకృతి తల్లిలాంటిదని, ప్రకృతికి ప్రాణాదారం అయిన చెట్లు ప్రాణికోటికి ప్రాణాదారం అని.. మొక్కల యొక్క విశిష్టతను క్షుణ్ణంగా తెలియజేశారు. పర్యావరణం పరంగా గతంలో జరిగిన నష్టాలను పూరించే దిశగా ఈ తరం యువత సమాజాన్ని పునర్నిర్మించాలని పిలుపునిచ్చారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితిలో కృత్రిమ ఆక్సిజన్ ను వేలాది రూపాయలు చెల్లించి ఎన్నో అవస్థలు పడిన పరిస్థితులను గుర్తు చేశారు. హరితాంధ్ర ప్రదేశ్ సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు ప్రతి ఇల్లు, ప్రతీ ఊరూ పచ్చదనంతో సింగారిద్దామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అటవీ శాఖతో కలిసి జూన్ 5 పర్యావరణ దినోత్సవం రోజు నుండి వచ్చే కార్తీక మాసం వరకు వర్షాలు విరివిగా కురిసే సీజన్ కావడంతో ఈ వన మహోత్సవం నిర్వహించడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఒక్క కోటి మొక్కలను నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. అదే స్ఫూర్తితో.. మన జిల్లాలో దాదాపు 4 కోట్ల మొక్కలను నాటే లక్ష్యం నిర్దేశించు కోవడం జరిగిందన్నారు. సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ.. తమ చుట్టూ వున్న పరిసరాలను పచ్చదనంతో నింపాలని ఆయన ఆకాంక్షించారు. మన కుటుంబంలో పుట్టునరోజు, పెళ్లిరోజు లాంటి ప్రత్యేక రోజుల్లో వారిచేత ఒక మొక్కను నాటించే అలవాటు నేర్పించాలన్నారు. మొక్కలను వ్యక్తిగతంగా అభిమా నిస్తూ.. మన ఇంటి పరిసరాల్లో, మనకు చేరువలో పచ్చదనాన్ని ఉంచుకోవాలని యువతను కోరారు. మనం నాటిన మొక్కలను మనమే క్రమం తప్పకుండా సంరక్షించే బాధ్యతను కూడా స్వీకరించాలన్నారు. డిఎఫ్ఓ వినీత్ కుమార్ మాట్లాడుతూ... జిల్లా విస్తీర్ణంలో అడవులు 33% విస్తరించి ఉన్నాయని, అటవీ విస్తీర్ణంలో జిల్లా అగ్రస్థానంలో ఉందన్నారు. ప్రస్తుతం అడవుల్లో 28.47% ఉన్న పచ్చదనాన్ని 33% శాతంకు పెంచేందుకు సామాజిక అడవుల పెంపకం ద్వారా, గ్రామీణ ఉపాధి హామీ పథకం భాగస్వామ్యంతో ప్రజలకు ఓ వైపు ఉపాధి కల్పిస్తూనే.. పచ్చదనాన్ని పెంచడం జరుగుతోందన్నారు.



ప్రభుత్వం చేపట్టే వనమహోత్సవం ద్వారా.. జిల్లాలో 4 లక్షలకు మించి విస్తృతంగా మొక్కలు నాటి.. 33% ఉన్న అటవీ విస్తీర్ణాన్ని 50%కు పెంచేందుకు కృషి చేస్తాం అన్నారు. హరితాంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా ప్రతిజ్ఞ అనంతరం వనమహోత్సవం సందర్భంగా.. జిల్లా అటవీశాఖ వారు హరితాంధ్ర ప్రదేశ్ సాధనకు.. పచ్చని చెట్లే ప్రగతికి సోపాన మార్గాలని గుర్తెరిగి.. ప్రకృతి సమతుల్యతలకు అనుగుణంగా.. ప్రతి నీటి బొట్టునూ సద్వినియోగ పరుస్తాం. వనాలను నరకబోము.. నరకనివ్వము. ప్రతి ఇంటా, ప్రతి ఊరా.. విరివిగా మొక్కలు నాటి సంరక్షిస్తామని.. కార్యక్రమానికి హాజరైన అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులతో ప్రతిజ చేయించారు. కార్యక్రమానికి ముందుగా గౌరవ, ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం గావించగా.. అనంతరం "స్థానిక అటవీ పునరుద్ధరణ పథకం-2025" ద్వారా యోగివేమన యూనివర్శిటీలో ఏర్పాటు చేసిన "యోగి వనం" ను జిల్లా కలెక్టర్, డిఎఫ్ఓ లు ప్రారంభిం చారు. అనంతరం అటవీ శాఖ వారు జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాల్ని తెలియజేసే ఛాయాచిత్రాల గ్యాలరీనీ జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో విశిష్టమైన సేవలు అందించిన.. మధుసూదన్ రెడ్డి.(బోటనీ ప్రొఫెసర్), అంకాల్, మునెయ్య, ద్వారకా నాథరెడ్డి, లక్ష్మీరెడ్డి లు సమాజ హితం కోసం చేసిన సేవలను ప్రశంసిస్తూ వారికి అవార్డులను బహుకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యోగి వేమన యూనివర్శిటీ, అటవీశాఖ, డ్వామా, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బంది, నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవశ్య విద్యాలయ విద్యార్థులు, సెక్రటరీ సువర్ణ, విద్యార్థులు తదితరుల పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం





**శ్రీకాళహస్తి/ పెన్ పవర్/ ప్రతినిధి/ జూన్ 5 :** ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో , సి ఆర్ వై - బెంగళూరు వారి ఆదేశాల మేరకు ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ సంబంధించి పిల్లల చేత పలు రకాల కార్యక్రమాలు చేయించడం జరిగింది. తమ గ్రామంలోని పంట పొలాల గురించి, వృక్షజాతుల గురించి, అంతరించిపోతున్న కొన్ని మొక్కల గురించి పిల్లలకు వివరించడం జరిగింది. జీవవైవిద్యంలో భాగంగా ప్రతి జీవరాశిని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ఈ సందర్భంగా అవగాహన కల్పించడం జరిగింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ప్రగతి సంస్థ వారు చేపట్టిన కార్యక్రమంలో బాలల సంఘం పిల్లలు చురుకుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లలు పర్యావరణానికి సంబంధించిన చిత్రలేఖనం, కథలు, వ్యాసాలు రాయడం జరిగింది. తమకు ఇష్టమైన చెట్టుకు సంబంధించిన అనేకమైన తీపి జ్ఞాపకాలను "జ్ఞాపకాల చెట్టు" అనే శీర్షికతో ప్రగతి సంస్థ వారు పిల్లల చేత వారి తీపి గుర్తులను నెమరు వేసుకునే విధంగా కార్యక్రమాలను చేపట్టడం. ముఖ్యంగా 15 నుండి 18 సంవత్సరాల పిల్లలు తమ బాల్యం నుండి ప్రస్తుత దశ వరకు గ్రామంలోని చెట్లతో వారికి ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సిబ్బంది రామచంద్ర, సచివాలయ సిబ్బంది సిబిఓ మెంబర్స్ అంగన్వాడి కార్యకర్తలు పిల్లల తల్లిదండ్రులు బాలల సంఘం పిల్లలు పాల్గొనడం జరిగింది.

# యోగ మనకు మన సమాజానికి ఆరోగ్యకరం

## డిఎం అండ్ హెచ్ఓ డా.ఈ.బి.దేవి






**అనంతపురం పెన్ పవర్ జూన్ 5 :** యోగాసనాలు వేయడం ద్వారా మనకు మన సమాజానికి ఆరోగ్యకరమని శారీరక ఆరోగ్యం తో పాటు మానసిక ఆరోగ్యం చేకూరుతుందని డిఎం అండ్ హెచ్ఓ డా.ఈ.బి.దేవి తెలిపారు. గురువారం ఉదయం యోగాంధ్ర మాసోత్సవాలలో భాగంగా ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆవరణం లో నర్సింగ్ విద్యార్థుల లతో పాటు కళాశాల సిబ్బందికి యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డిఎంహెచ్వో మాట్లాడుతూ, నిత్యం యోగ చేయడం ద్వారా ప్రతి ఒక్కరిలోని ఒత్తిడి దూరమవుతుందన్నారు. మానవుని దైనందిక జీవితం ప్రస్తుతం ఉరుకుల పరుగుల మధ్య సాగుతోందని, ఈ క్రమంలో ప్రతి ఒక్కరూ యోగాసనాలు వేయడం ద్వారా అనేక శారీరక రుగ్మతల నుండి కూడా బయటపడవచ్చున్నారు.అలాగే ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేసుకుని జూన్ 21వ తేదీన నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ ఉపయోగించుకోవాలన్నారు. ఆరోగ్య, ఆనంద,ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లలిత కుమారి మాట్లాడుతూ, ప్రతిరోజు యోగా చేయడం వలన ఆరోగ్యం బాగుంటుందన్నారు.యోగాను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో భాగంగా చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ యోగ చేసి ఆరోగ్యంగా ఉండాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి ఆకాంక్ష అన్నారు.ఈ కార్యక్రమంలో దాదాపు 300 మంది యోగ అభ్యాసకులు పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో డిఐపిఆర్ఓ పి.గురుస్వామి శెట్టి, నర్సింగ్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ అనంతమ్మ ,ఆయుష్ డిపార్ట్మెంట్ అధికారులు డా.లాల్య నాయక్, డా. భాస్కర్, జిల్లా టూరిజం అధికారి జయకుమార్, యోగా గురువులు కృష్ణవేణి, గురు రాజారావు, డెమో త్యాగరాజు, డిప్యూటీ హెచ్ఈఓ గంగాధర్, ట్యూటర్ అనురాధ ,నర్సింగ్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నేటి (జూన్ 6) నుండి ఏపీ మెగా డీఎస్సీ - 2025

## పరీక్షల నిర్వహణ కు పకడ్బందీగా ఏర్పాట్లు...



చిత్తూరు, పెన్ పవర్ జూన్ 05 : ఈనెల 6వ తేదీ శుక్రవారం నుంచి నిర్వహించే ఏపీ మెగా డీఎస్సీ - 2025 నిర్వహణ కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురు వారం జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా ఏపీ మెగా డీఎస్సీ - 2025 నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏపీ మెగా డీఎస్సీ - 2025,ఉపాధ్యాయ అర్హత పరీక్ష ను జూన్ 6వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. మెగా డీఎస్సీ కోసం అన్ని ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.

ఎక్కడ ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా పరీక్షా కేంద్రాలలో నిర్వహణ ఉండాలన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలను నిర్ణయించుకోవడంలో భాగంగా చెన్నైలో పరీక్ష కేంద్రంగా ఎంపిక చేసుకున్న వారికి అక్కడే పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చిత్తూరు జిల్లాకు సంబంధించి మొత్తం ఎనిమిది పరీక్ష కేంద్రాలు ఉండగా అందులో 4 పరీక్ష కేంద్రాలు చిత్తూరు జిల్లాలో, మరో నాలుగు పరీక్ష కేంద్రాలు చెన్నైలో ఉన్నాయని చెన్నైలో నిర్వహించే పరీక్ష కేంద్రాల నిర్వహణ కూడా చిత్తూరు జిల్లా విద్యాశాఖచే పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. చిత్తూరు జిల్లాలోని 4 పరీక్ష కేంద్రాలలో 22,046 మంది ఈ పరీక్షలకు హాజరవుతుండగా... చెన్నై లోని 4 పరీక్ష కేంద్రాలలో 1,484 మంది అభ్యర్థులు పరీక్షకుహాజరవుతున్నారన్నారు. ప్రతిరోజు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 వరకు, మధ్యాహ్నం 02:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలను నిర్వహించడం జరుగుతుందన్నారు. మెగా డీఎస్సీ - 2025 పరీక్షల సజావు నిర్వహణకు పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు తో పాటు 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. ఆర్ డి ఓ లు వారి పరిధిలోని పరీక్షా కేంద్రాలను పరిశీలించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. అన్ని పరీక్ష కేంద్రాలలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని, సైన్ బోర్డ్స్ ఉండాలన్నారు. పరీక్షల కోసం కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద మెడికల్ కిట్టు తో కూడిన ఏఎన్ఎంలు అందుబాటులో ఉండాలని అభ్యర్థులకు అవసరమైన వైద్య సేవలు అందించాలన్నారు.పరీక్షా కేంద్రాలలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండాలని ఆదేశించారు.

# ఊపు ఎక్కడా....

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికలు జరిగి ఫలితాలు వచ్చి ఏడాది గడుస్తుంది. అయితే ఈ ఏడాదిలో వైసీపీ పరిస్థితి ఏంటన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గత ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా వైసీపీకి లభించలేదు. 175 నియోజకవర్గాలకు గాను కేవలం పదకొండు స్థానాలు మాత్రమే వైసీపీకి వచ్చాయి. ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పాటయిన శాసనసభ సమావేశాలకు కూడా వైసీపీ ఎమ్మెల్యేలు హాజరు కావడం లేదు. దీంతో ప్రజాసమస్యలను శాసనసభలో ప్రస్తావించేవారు లేదు. తనకు ప్రతిపక్ష హోదా ఇస్తేనే వస్తానని జగన్ పట్టుబట్టడం కూడా ప్రజల్లో ఒకరకమైన వ్యతిరేక భావన ఏర్పడింది. ప్రతిపక్ష హోదా ఇస్తేనే వెళతామని అనడం సరికాదన్న కామెంట్స్ బాగానే వినిపిస్తున్నాయి,శాసనసభలో వైసీపీ వాయిస్ లేకుండా పోయింది. ఇది జగన్ పార్టీకి మైనస్ అని చెప్పాలి. అదేసమయంలో జగన్ ఏడాది నుంచి బెంగళూరు నుంచి విజయవాడ కు ట్రిప్పులు వేస్తున్నారు. నెలలో కొన్ని రోజులు మాత్రమే నేతలకు అందుబాటులో ఉంటున్నారు. స్థానిక సంస్థలను కూటమి ప్రభుత్వం కైవసం చేసుకోవడంతో ఆయన తరచూ లోకల్ లీడర్లతో భేటీ అవుతున్నారు. మళ్లీ వచ్చేది వైసీపీ ప్రభుత్వమేనన్న నమ్మకాన్ని కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. అయినా స్థానిక సంస్థలన్నీ కూటమి పరమయిపోయాయి. ఇక ఉగాది నుంచి జిల్లాల పర్యటనలు చేస్తానని ప్రకటించిన వైఎస్ జగన్ ఎప్పటికప్పుడు తన పర్యటనను వాయిదావేసుకుంటూ వెళుతున్నారు. ఏడాది కూటమి ప్రభుత్వంలో తమ వారిపై నమోదవుతున్న కేసుల విషయంలోనే జగన్ కొంత పట్టించుకుంటున్నారు. ఏడాది నుంచి నియోజకవర్గాల ఇన్ ఛార్జులతో సమావేశం కాలేదు. అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. చివరకు తన సొంత జిల్లా కడపలోనూ నేతలతో ఆయన సమావేశమవ్వడం తక్కువేనని అంటున్నారు. ఈసారి అధికారంలోకి వస్తే కార్యకర్తలకు ప్రాధాన్యత నిస్తామని చెబుతున్న జగన్ మాత్రం నేతలకు సంబంధించి ఎటువంటి భరోసా ఇవ్వడం లేదు. గత ఎన్నికల్లో ఇష్టారీతిన నియోజకవర్గాలను మార్చేశారు. నేతలకు పట్టున్న నియోజకవర్గాల నుంచి బయటకు పంపారు. ఈ ప్రయోగం విఫలమయిందని తెలిసినా తిరిగి అక్కడ ఇన్ ఛార్జులను నియమించకపోవడంతో ఏడాదిగా ఆ యా ప్రాంతాల్లో క్యాడర్ అయోమయంగా ఉంది.మరొక వైపు అప్పుడప్పుడు ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు చేస్తున్నప్పటికీ, మీడియా సమావేశాలు పెడుతున్నప్పటికీ జగన్ ఇంకా పూర్తి స్థాయిలో జనానికి అందుబాటులోకి రాలేదు. తాడేపల్లి కేంద్ర కార్యాలయానికే అధికారంలో లేనప్పుడు కూడా పరిమితమయ్యారు. రైతుల సమస్యలపై కొంత వెళుతున్నప్పటికీ జగన్ 2019 ఎన్నికలకు ముందు చేసిన తరహాలో దీక్షలు, ధర్నాలు వంటివి చేయకపోవడం పార్టీ క్యాడర్ లో ఇంకా ఊపు తెప్పించలేకపోతుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. కూటమి ప్రభుత్వాన్ని ఎండగట్టే ప్రయత్నం చేస్తున్నప్పటికీ అది జనంలోకి బలంగా వెళ్లగలిగేలా మాత్రం ఆయన చర్యలు ఫలితాలు ఇవ్వడం లేదన్నది మాత్రం యదార్థం.ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను సొమ్ము చేసుకోవడంలో కనీసం యాభై శాతం కూడా సక్సెస్ కాలేకపోయినట్లు రాజకీయ విశ్లేషకుల అంచనా.

# వేగంగా కొనసాగుతున్న నకిలీ నెయ్యి కేసు



**హైదరాబాద్ పెన్ పవర్:** తిరుమల శ్రీవారి లడ్డులో వినియోగించే నెయ్యి లో కల్తీ జరిగిందినే కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కి పిఏ గా పని చేసిన అప్పన్నకు సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. బుధవారం నుంచి మూడు రోజులు పాటు తిరుపతి లోని సిట్ కార్యాలయంలో అప్పన్నను సీట్ అధికారులు ప్రశ్నించనున్నారు. నత్వరలో మాజీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డికి, మాజీ ఈవో ధర్మారెడ్డికి నోటీసులు ఇచ్చే అవకాశం ఉందని సమాచారం. టీటీడీ మాజీ జేఈవో కి సహ ఇతర అధికారులకు నోటీసులు ఇచ్చి విచారించనున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. 2024 సెప్టెంబర్‌లో, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో జంతు కొవ్వు , చేప నూనెతో కూడిన కల్తీ నెయ్యి ఉపయోగించినట్లు ఆరోపించారు. దర్యాప్తు చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసింది. అయితే, సిట్ దర్యాప్తుపై పారదర్శకత లేని ఆరోపణలు రావడంతో, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సీబీఐ ఆధ్వర్యంలో స్వతంత్ర సిట్ ఏర్పాటు చేశారు. ఈ బృందంలో సీబీఐ నుంచి ఇద్దరు, ఏపీ ప్రభుత్వం నుంచి ఇద్దరు, ఎఫ్ఎస్ఎస్ఏఐ నుంచి ఒకరు సభ్యులుగా ఉన్నారు.ఈ కేసులో ఇప్పటివరకు 15 మందిని నిందితులుగా పేర్కొనగా, వీరిలో 6 మందిని సిట్ అరెస్టు చేసింది. తమిళనాడులోని ఏఆర్ డెయిరీ, ఉత్తరాఖండ్‌లోని బోలేబాబా డెయిరీ, యు తిరుపతిలోని వైష్ణవి డెయిరీకి చెందిన వ్యక్తులు అరెస్టు అయ్యారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో తెర వెనుక ఎవరు ఉన్నారన్న దానిపై సిట్ విచాణ జరుపుతోంది. కల్తీ నెయ్యి సరఫరాకు సంబంధించి టెండర్ నిబంధనలను మార్చిన సూత్రధారులపై సిట్ దృష్టి సారించింది. ఏఆర్ డెయిరీకి టెండర్ దక్కేలా వైఎస్ఆర్‌సిపి హయాంలో టీటీడీ పాలకవర్గంలోని కొంతమంది సభ్యులు, అధికారులు పనిచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.లభించిన ఆధారాలతో %యుణ% మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ అప్పన్నకు సిట్ నోటీసులు జారీ చేసి, ప్రశ్నిస్తున్నారు. అప్పన్నతో పాటు మరో ఆరుగురు టీటీడీ ఉద్యోగులను కూడా ప్రశ్నిస్తున్నారు. ప్రాథమికంగా లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి వాడారని గుర్తించారు. ఈ క్రమంలో అక్రమాలు ఎవరు చేశారు.... అవినీతి ఎలా జరిగింది.. కల్తీ నెయ్యిలో ఏమేమి కల్తీ అయ్యాయన్నది వెల్లడి కావాల్సి ఉంది. ఇవన్నీ వెల్లడి అయితే .. దర్యాప్తు నివేదికను సీబీఐ సుప్రీంకోర్టుకు సమర్పించే అవకాశం ఉంది.

# తెలుగు రాష్ట్రాల్లో హర్యానా గ్యాంగ్ కలకలం

**హైదరాబాద్ పెన్ పవర్:** చిత్తూరు జిల్లా కుప్పంలో హర్యానాకు చెందిన దొంగల ముఠా రెచ్చిపోయింది. కుప్పం మీదుగా సరిహద్దు దాటుతుండగా.. మంగళవారం అర్ధరాత్రి పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో కారులో వెళ్తున్న దొంగలు పోలీసులను తొక్కించబోయారు. పోలీసులు కాల్పులు జరిపి వారిని ఆపడానికి ప్రయత్నించారు. అనంతరం దొంగలు కారును వదిలి పారిపోగా.. పోలీసులు వారి కోసం గాలిస్తున్నారు. కుప్పం డీఎస్పీ రూరల్ సీఐ ఆధ్వర్యంలో పోలీసులు కృష్ణగిరి – పలమనేరు నేషనల్ హైవేపై తనిఖీలు చేపట్టారు. తంబిగానిపల్లె చెక్‌పోస్ట్ దగ్గర వాహనాలను తనిఖీ చేస్తుండగా.. రాత్రి 10.30 గంటలకు ఒక కర్ణాటక రిజిస్ట్రేషన్‌తో ఉన్న స్కార్పియో కారును ఆపారు.ఆ కారులో తనిఖీలు చేసేందుకు ఇద్దరు కానిస్టేబుళ్లు వెళ్లగా.. వెంటనే దొంగలు కారును వెనక్కి పోనిచ్చి వారిపైకి ఎక్కించే ప్రయత్నం చేశారు. కానిస్టేబుళ్లు అప్రమత్తమై వెంటనే పక్కకు తప్పుకోవడంతో ప్రమాదం తప్పింది. వెంటనే అప్రమత్తమైన సీఐ మల్లేష్ యాదవ్ కాల్పులు జరిపారు. తన సర్వీసు రివాల్వర్‌తో కారు డ్రైవర్ కాలుకు తగిలేలా కాల్చారు. కాల్పులు జరిపిన తర్వాత దొంగలు కారుతో సహా అక్కడి నుంచి పారిపోయారు. పోలీసులు వెంటనే టీమ్‌లుగా ఏర్పడి వారి కోసం గాలించారు. కారు ఆంధ్రప్రదేశ్ సరిహద్దు దాటకపోవడంతో కుప్పం పరిసర ప్రాంతాల్లో గాలింపు కొనసాగిస్తున్నారు. నిందితులు పరమసముద్రం చెరువు దగ్గర కారును వదిలి పారిపోయారన్నారు పోలీసులు.హత్యాయత్నం కింద దొంగలపై కేసు నమోదు చేశామన్నారు డీఎస్పీ పార్థసారథి. సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరంగా చేస్తున్నామని.. ఈ క్రమంలోనే డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించామన్నారు. ఒకవేళ ఎక్కడైనా అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. స్థానికులు, ప్రత్యక్ష సాక్షులు చెబుతున్న వివరాలను బట్టి కారులో ఐదుగురు ఉన్నారన్నారు. దొంగలు హర్యానాకు చెందిన ముఠాగా పోలీసులు అనుమానిస్తున్నారు. వీరు గతంలో చాలా రాష్ట్రాల్లో దొంగతనాలు చేశారంటున్నారు. పోలీసులు జరిపిన కాల్పుల్లో డ్రైవర్‌కు గాయాలయ్యాయంటున్నారు. నిందితుల కోసం గాలింపు కొనసాగుతోంది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మంత్రులకు సుతి మెత్తని క్లాస్

**హైదరాబాద్ పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశంలో చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రులు మాట్లాడే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మంత్రుల మధ్య సమన్వయం కొరవడితే నవ్వుల పాలవుతామని, ఒకే అంశంపై మాట్లాడేటప్పుడు అందరూ ఒకే విధంగా మాట్లాడితే ప్రజల్లోకి సరైన పద్ధతిలో వెళుతుందని చంద్రబాబు అన్నారు. అంతే తప్ప ఎవరికి వారు ఒకే అంశంపై వేర్వేరు విధంగా మాట్లాడితే ప్రభుత్వంపై ప్రజలు వ్యతిరేకత పెంచుకునే అవకాశముందని చెప్పారు. అందుకే మాట్లాడే ముందు మంత్రులు సబ్జెక్ట్ పై అవగాహనకు వచ్చి మాట్లాడాలని, సమన్వయంతో వ్యవహరించాలని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న సందర్భంగా మంత్రులందరూ చంద్రబాబుకు అభినందనలు తెలిపారుకొందరు మంత్రుల పనితీరును... అయితే మంత్రులు ఇంకా పనితీరును మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందని, కేవలం శాఖపరమైన విషయాలు మాత్రమే కాకుండా పార్టీ సంబంధిత విషయాలను గ్రౌండ్ లెవెల్లో ఏం జరుగుతుందన్నది ఎప్పటికప్పుడు తెలుసుకుని తమకు కేటాయించిన జిల్లాల్లో పరిస్థితులను తమకు తెలియజేయాలని కోరారు. అలాగే కార్యకర్తలకు న్యాయం జరిగేలా ప్రతి ఒక్కరూ వ్యవహరించాలని కూడా చంద్రబాబుఅన్నారు. ఈ ఏడాదిలో అనేక మంది కొత్తగా మంత్రి పదవులు చేపట్టారని, వచ్చేఏడాదికి పనితీరును మరింత మెరుగుపర్చుకోవాలని చంద్రబాబు సూచించారు. చాలా మంది మంత్రుల పనితీరు బాగుందని, అయితే కొందరు మాత్రం కొంత తమ వ్యవహారశైలితో పాటు పనితీరులో కూడా మార్పులు చేసుకోవాలని ఆయన అన్నారు... ప్రత్యర్థి పార్టీ నేతల అరెస్ట్ ల గురించి ఆలోచించవద్దని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని, తప్పు చేసి ఉంటే ఖచ్చితంగా అరెస్ట్ అవుతారని చంద్రబాబు తెలిపారు అది జగన్ అయినా మరొకరయినా ఒకటే న్యాయం ఉంటుందని అన్నారు. నిత్యం ప్రజల్లో మమేకమవుతూ ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, సోషల్ మీడియాలో పాటు పత్రికల్లో వచ్చే వార్తలకు కూడా మంత్రులు స్పందించాలని, లేకపోతే అందులో వచ్చే వార్తలు నిజమని ప్రజలు భావించే అవకాశముంటుందని, ఆ ఛాన్స్ ఎవరూ తీసుకోవద్దని అన్నారు. ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధితో పాటు సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మంత్రులు ముందుండాలని కూడా చంద్రబాబు మంత్రులను ఆదేశించారు.

### ఏడాది పాలనపై బాగుందనే ఫీలింగ్

ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది కావస్తుంది. ఈ ఏడాది పాలనలో చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజలు ఏమనుకుంటున్నారన్న దానిపై చర్చ జరుగుతుంది. అయితే కూటమి ప్రభుత్వంపై పెద్దగా వ్యతిరేకత కనిపించడం



లేదు. ఏడాది మాత్రమే కావడంతో ప్రజలు ఇంకా ఒక నిర్ణయానికి రాలేకపోతున్నారు. అదే సమయంలో జగన్ ఐదేళ్ల పాలనతో బేరీజు వేసుకుని చూస్తే ఇటు పరవాలేదని చెప్పలేని పరిస్థితి. అటు బాగా లేదని అనలేని స్థితి ఉంది. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. ప్రతి ఒక్కరి మనసులో అభివృద్ధి జరగాలని ఆశిస్తారు. అదే సమయంలో మన రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు ధీటుగా ఉండాలని భావిస్తారు. అయితే ఏడాదిలో చంద్రబాబు ప్రభుత్వం ప్రజల అంచనాలు, ఆలోచనలు అందుకోలేకపోయిం దన్న కామెంట్స్ వినపడుతున్నాయి.. రోడ్లు బాగుండాలని కోరుకుంటారు. పరిశ్రమలు రావాలని అనుకుంటారు. పది మందికి ఉపాధి అవకాశాలు దక్కాలని ఆశిస్తారు. నిరుద్యోగ సమస్య లేకుండా తక్కువ ధరలకు నిత్యావసరాలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు సహజంగా కోరుకుంటారు. ఈ విషయాల్లో కూటమి ప్రభుత్వానికి మంచి మార్కులే పడతాయి. ఎందుకంటే వచ్చిన వెంటనే రహదారులను మరమ్మతులు చేశారు. పరిశ్రమలు కూడా ఒక్కొక్కటి వస్తున్నాయి. ఉపాధి అవకాశాలు మెరుగయితాయన్న భావన ప్రజల్లో ఉంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నుంచి సహకారం అందుతుండటంతో నిధులు సమకూరడంతో పాటు పరిశ్రమలు కూడా త్వరగానే వస్తాయని ప్రజలు భావిస్తున్నారు. అయితే మిగిలిన తొమ్మిది నెలల్లో జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకుంటే పరవాలేదని పించేలా ఉందని ప్రజలు అంటున్నారు. అదే సమయంలో సంక్షేమ పథకాలపై మాతరం పేద, దిగువ మధ్యతరగతి ప్రజలు పెదవి విరుస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛను నాలుగు వేల రూపాయలకు పెంచడం ఒకే. అదే సమయంలో ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అందచేస్తున్నారు.

అంతకు మించి రైతులకు, మహిళలకు, విద్యార్థులకు సంబంధించిన పథకాలను గ్రౌండ్ చేయలేకపోవడంతో ఒకింత ఆ వర్గం ప్రజలు మాత్రం పెదవి విరుస్తున్నారు. జగన్ హయాంలో తమ బ్యాంకు అకౌంట్లో డబ్బులు ఉండేవని, కానీ కూటమి సర్కార్ ఏర్పాటయిన ఏడాదిలో అకౌంట్ లోకి పైసా పడకపోవడంపై ఒకింత అసంతృప్తి కనిపిస్తుంది. కానీ చంద్రబాబు మాత్రం గత ప్రభుత్వం పది లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసిందని, వరసగా అన్ని పథకాలను అమలు చేస్తామని, ఇచ్చిన హామీలతో క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పడం ఒకింత ఊరటనిచ్చే అంశమే. ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ పథకాన్ని అందచేయనున్నారు. అలాగే తల్లికి వందనం పథకాన్ని కూడా అమలు చేస్తామని ప్రకటించారు. కానీ ఒకేసారి కాకుండా విడతల వారీగా జమ చేస్తామని చెప్పడం ఒకింత ప్రజల్లో అసహనంకలుగుతుంది. రెండు నుంచి మూడు వేలు వస్తే ఉపయోగం ఏంటని ప్రశ్నిస్తున్నారు. మరొకవైపు ఆగస్టు పదిహేనో తేదీ నుంచి ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళలకు అందిస్తుండటంతో రానున్న కాలంలో ఈ ఒపీనియన్ లో మార్పు వచ్చే అవకాశముందన్న భావనలో టీడీపీ నేతలున్నారు.

# ఇమేజ్ పెరిగిందా...డ్యామేజ్ అయిందా

**హైదరాబాద్ పెన్ పవర్:** జనసేన అధినేతగా జనంలోకి వచ్చి అధికారాన్నిచేపట్టిన పవన్ కల్యాణ్ ఆంధ్రప్రదేశ్ లో ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఈరోజుకు గత ఏడాది ఎన్నికల ఫలితాలు వచ్చాయి. జనసేనకు హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేటు వచ్చింది. ఇరవై ఒక్క అసెంబ్లీ స్థానాల్లోనూ, రెండు పార్లమెంటు స్థానాల్లో పోటీ చేసిన అభ్యర్థులు అందరూ గెలిచారు. దాదాపు పదిహేడు శాతం ఓటు బ్యాంకును కూడా సొంతం చేసుకుంది. తర్వాత చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలను చేపట్టారు. కీలకమైన గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖతో పాటు తనకు అత్యంత ఇష్టమైన అటవీ శాఖను అడిగి మరీ తీసుకున్నారు. తనతో పాటు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ కు కేబినెట్ లో అవకాశం కల్పించారు. తొలిసారి మంత్రి పదవి తీసుకోవడంతో కొన్ని రోజుల పాటు తనకు అప్పగించిన శాఖలపై పవన్ కల్యాణ్ పూర్తి స్థాయి అధ్యయనం చేశారు. కేరళలో ఉన్న ఏపీకి చెందిన ఐఏఎస్ అధికారి కృష్ణతేజ ను తన టీంలోకి తెచ్చుకుని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ఫోకస్ పెట్టారు. గ్రామాల్లో రహదారులు, మంచినీటి సమస్యలను ప్రధానంగా తొలగించేందుకు ఒకింత పవన్ కల్యాణ్ చేసిన ప్రయత్నాలు ఫలించాయని చెప్పాలి. పంచాయతీలకు నిధులు విడుదల చేయించడంలో పవన్ కల్యాణ్ సక్సెస్ అయ్యారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులను నిర్మించి అటవీ పుత్రులకు అండగా తాను ఉన్నానన్న భరోసాను పవన్ కల్యాణ్ ఇవ్వగలిగారు. ఇక ఏనుగుల దాడి నుంచి పంటలను రక్షించేందుకు కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను తెప్పించడంలో కీలకంగా వ్యవహరించారు.ఇక ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో పవన్ కల్యాణ్ కొన్ని నిర్ణయాల పట్ల మౌనంగా ఉండటం, ప్రభుత్వాన్ని ప్రశ్నించలేకపోవడం ఒకింత ఆయన ఇమేజ్ ను డ్యామేజీ చేస్తుందనే చెప్పాలి. పవన్ కల్యాణ్ గతంలో ఎన్నడూ అధికారంలో లేకపోవడం, తాను పవర్ లోకి వస్తే ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై ప్రశ్నించే వారు ఎక్కువయ్యారు. ప్రశ్నించడానికే రాజకీయాల్లోకి వచ్చినట్లు తనకు తాను ప్రకటించుకున్న పవన్ కల్యాణ్ ప్రశ్నల గురించి మానేశారు. ఆయన ప్రభుత్వ నిర్ణయాలకు తలూపటమే ఇప్పుడు విమర్శలకు తావిస్తుంది. అమరావతి రాజధాని నిర్మాణానికి ఇస్తున్న ప్రాధాన్యత సమస్యల పరిష్కారానికి పాటుపడకపోవడంపై పవన్ మౌనాన్ని సోషల్ మీడియాలో చాలా మంది తప్పుపడుతున్నారు. . నిజానికి ప్రభుత్వంలో ఉండి బహిరంగంగా విమర్శించడానికి అవకాశం లేదు. అంతర్గత సమావేశాల్లోనే తనకున్న అభ్యంతరాలను తెలియజేయాల్సి ఉంటుంది. చంద్రబాబు కేబినెట్ లో ఉప ముఖ్యమంత్రిగా ఉండి బహిరంగంగా విమర్శలు చేస్తే అది ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తుంది. ఎవరైనా ఇలాగేనే చేస్తారు. కానీ పవన్ కల్యాణ్ అంతర్గత సమావేశాల్లోనూ తలూపి రావడం వల్లనే ఈ విమర్శలు ఎక్కువయ్యాయని అంటున్నారు. ఆయన గత ఎన్నికల సందర్భంగా మాట్లాడిన మాటలు, ఇచ్చిన హామీలను ట్రోల్ చేస్తూ వైసీపీ నేతలు పవన్ కల్యాణ్ వెంట పడుతున్నారు. మొత్తం మీద పవన్ కల్యాణ్ నిజాయితీగా ఉన్నప్పటికీ, తన శాఖల విషయంలో మంచి పురోగతి సాధించినప్పటికీ ప్రశ్నించడం మానేసి ప్రజల్లో చులకనయ్యారంటున్నారు.

# దారి మళ్లుతున్న రేషన్ బియ్యం

**హైదరాబాద్ పెన్ పవర్:**
రేషన్ సరకులు పక్కదారి పట్టకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే రేషన్ షాపుల్లోనే నేరుగా రేషన్ ఇస్తోంది. ఇప్పుడు మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై రేషన్ బియ్యం వద్దు అన్న వాళ్లకు నిత్యవసర సరకులు ఇచ్చేందుకు సిద్ధమైంది. ఇలా చేయడం వల్ల బియ్యం పక్కదారి పట్టకుండా చూడొచ్చని భావిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో చాలా కాలం నుంచి రేషన్ బియ్యం పక్కదారి పడుతున్న విషయం తెలిసిందే. ఎన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నా చట్టాల్లోని లోపాలని వినియోగించుకొని కేటుగాళ్లు తప్పించుకుంటున్నారు. వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేయడం వల్ల ఇలాంటి దందా విపరీతంగా పెరిగిపోయిందని ప్రభుత్వం షాపుల ద్వారా పంపిణీ చేపట్టింది. కానీ ఇలా పంపిణీ చేపట్టిన తొలి రోజే భారీ సంఖ్య రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. రేషన్ బియ్యం మాఫీ వెనుకాల ఉన్న వారి ఎత్తులు ఒక రకంగా ఉంటే... రేషన్ బియ్యం అవసరం లేని వాళ్లు వాటిని అమ్ముతున్నట్టు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఈ మధ్య వివిధ ప్రాంతాల్లో తిరిగి ప్రజలతో మాట్లాడిన శాసనసభా కమిటీ కీలక సూచనలు చేసింది. ఆరోగ్యశ్రీ తోపాటు ఇతర ప్రభుత్వ పథకాల కోసం కొందరు రేషన్ కార్డు తీసుకుంటున్నారని తేలింది. అలాంటి వారికి రేషన్ అవసరం లేదని అందుకే వారు ఆ రేషన్ తీసుకొని అమ్మేయడమో లేదా రేషన్ డీలర్‌కు వదిలేయడంతో వాళ్లు అమ్ముకోవడం జరుగుతోందని పేర్కొన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా అరికెట్టేందుకు కేవలం ప్రభుత్వ పథకాలు, ఆరోగ్యశ్రీ కోసమే రేషన్ కార్డు తీసుకుంటున్న వారికి వేరే కార్డు ఇస్తే సరిపోతుందన్నారు. ఆరోగ్య శ్రీకు వేరుగా కార్డు ఇస్తే



వాళ్లకు రేషన్ కార్డు కట్ చేయవచ్చని తెలిపారు. ఫలితంగా రేషన్ పక్కదారి పట్టే సమస్యకు పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. వారి సూచనలు పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం నేరుగా రేషన్ కార్డు కట్ చేస్తే వ్యతిరేకత వస్తుందని ప్రత్యామ్నాయ ఆలోచన చేస్తోంది. అలాంటి వారందరి నుంచి ముందే సమాచారం సేకరించి వారికి నిత్యవసర సరకులు ఇవ్వబోతున్నారు. బియ్యం వద్దంటే వారికి కందిపప్పు, నూనెతోపాటు ఇతర సరకులు ఇస్తారు. దీని వల్ల ప్రభుత్వంపై భారం పడినప్పటికీ అక్రమాలకు అడ్డుకట్ట వేయొచ్చని అంటున్నారు. నలుగురు ఉండే కుటుంబంపై ప్రభుత్వం బియ్యం ఇచ్చేందుకు దాదాపు వెయ్యి రూపాయలు ఖర్చు పెడుతుంది. అదే ఖర్చు నిత్యవసరాలు ఇవ్వగలిగితే వారికి కూడా మేలు జరుగుతుందని అంచనా వేస్తోంది. ఈ మేరకు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పుడు అభిప్రాయసేకరణ చేసిన తర్వాత ఇంప్లిమెంట్ చేయనున్నారు. భవిష్యత్‌లో సన్నబియ్యం కూడా ఇవ్వాలనే ఆలోచన ప్రభుత్వంలో ఉన్నట్టుంది. అప్పుడు మాఫియా మరింత రెచ్చిపోతుందని ఇప్పటి నుంచే దాన్ని కట్టడి చేయాలనే ఆలోచన ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ఇక్కడ రేషన్ బియ్యాన్ని బ్లాక్‌లో కొంటున్న వాళ్లంతా వాటిని పాలిష్ చేసి విదేశాలకు ఎగుమతి చేసుకున్నారు.

## ఆర్సీబీ విజయోత్సవాలు అంత హడావుడిగా ఎందుకు నిర్వహించారు?: మదన్‌లాల



**హైదరాబాద్ పెన్ పవర్:** చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ విజయోత్సవాల సందర్భంగా తొక్కిసలాట జరిగి 11 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో సరైన ప్రణాళిక లేకుండా అంత హడావుడిగా ఈ కార్యక్రమం నిర్వహించాల్సిన అవసరం ఏమొచ్చిందని భారత మాజీ క్రికెటర్ మదన్‌లాల్ ప్రశ్నించాడు. ఇంటర్నెట్ డెస్క్: ఐపీఎల్ 18వ సీజన్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజేతగా నిలిచింది. ఇదే వారికి తొలి టైటిల్. ఈ నేపథ్యంలో బుధవారం బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ యాజమాన్యం ఆధ్వర్యంలో విజయోత్సవాలు నిర్వహించారు. అయితే మైదానం వెలుపల తొక్కిసలాట చోటుచేసుకుని 11 మంది మృతి చెందారు. పలువురు గాయాలపాలయ్యారు. ఈ దుర్ఘటనపై 1983 వరల్డ్ కప్ గెలిచిన నాటి భారతజట్టులో (%ఋఖుఎ ×అఎఋఖు%) సభ్యుడైన మదన్‌లాల్ స్పందించాడు. విజయోత్సవ ఏర్పాట్లు అస్తవ్యస్తంగా ఉన్నాయంటూ ఆర్సీబీని తప్పు బట్టాడు. అంత హడావుడిగా ఈ కార్యక్రమాన్ని ఎందుకు ఏర్పాటు చేశారని ప్రశ్నించాడు. 'మీరు గత రాత్రి అహ్మదాబాద్‌లో సంబరాలు చేసుకున్నారు. మరుసటి రోజే బెంగళూరులో గ్రాండ్ ఈవెంట్‌ను నిర్వహించడానికి ఇంత తొందరపాటు ఎందుకు? సరైన ప్రణాళిక లేకుండా ఈ కార్యక్రమం నిర్వహించడం వల్ల అనవసరంగా పదకొండు మంది తమ ప్రాణాలు కోల్పోయారు' అని మదన్ లాల్ ఆవేదన వ్యక్తం చేశాడు. చిన్నస్వామి స్టేడియంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయడంతో తమ అభిమాన క్రికెటర్లను చూడటానికి లక్షల సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. కానీ స్టేడియం సామర్థ్యం కేవలం 35 వేలు. దీంతో మైదానం వెలుపల తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో 11 మంది మృతి చెందగా, దాదాపు 50 మంది గాయాలపాలయ్యారు. ఈ విషయం తెలియడంతో నిర్వాహకులు వేడుకను 20 నిమిషాలకు కుదించి, ముగించారు.

ఇది ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యక్రమం కాదని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వివరణ ఇచ్చారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ విజయోత్సవం జరిగిందని తెలిపారు. బెంగళూరు జట్టు కాబట్టి తాము కార్యక్రమంలో పాల్గొన్నామని ఆయన విలేకరులతో అన్నారు.

# ఇద్దరూ ఇద్దరే..




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్‌లో అత్యంత గొప్ప కెప్టెన్‌గా పేరున్న మహేంద్రసింగ్ కొన్నేళ్ల ముందే పగ్గాలు వదిలేశాడు. ఈ సీజన్‌కు తాత్కాలికంగా సారథ్య బాధ్యతలు నిర్వర్తించినా తనదైన ముద్ర వేయలేకపోయాడు. రోహిత్ శర్మ గత సీజన్లోనే కెప్టెన్సీకి దూరమయ్యాడు. కోహ్లి తనకు తానుగా మూడేళ్ల ముందే పగ్గాలు వదిలేశాడు. దిగ్గజ స్థాయి ఆటగాళ్లు ఒక్కొక్కరుగా కెప్టెన్సీకి దూరమైన ఐపీఎల్‌లో ప్రస్తుతం యువ సారథులదే హవా. ముఖ్యంగా ఈ సీజన్లో ఇద్దరు కుర్ర కెప్టెన్లు అందరి దృష్టినీ తమ వైపు తిప్పుకొన్నారు. ఇప్పటికే సారథిగా తానేంటో రుజువు చేసుకున్న ఓ కెప్టెన్, ఈసారి మరింత రాటుదేలితే.. మరో కెప్టెన్ అరంగేట్రంలోనే అదరగొట్టేశాడు. ఆ ఇద్దరే శ్రేయస్ అయ్యర్, రజత్ పాటీదార్.ఐపీఎల్ ఆరంభమవుతుంటే.. టైటిల్ గెలిచే జట్టేది, ప్లేఆఫ్స్ చేరే జట్లేవి అన్న అంచనాలు మొదలవుతాయి. కప్పు గెలవడం సంగతి అటుంచితే.. చాలా ఏళ్లుగా ప్లేఆఫ్స్ చేరగల జట్టుగానూ ఎవ్వరూ పరిగణించని టీమ్ ఏదైనా ఉందీ అంటే.. అది పంజాబే! 17 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలో ఆ జట్టు ఒక్కసారే ఫైనల్ ఆడింది. ఓసారి సెమీస్ చేరింది. దశాబ్ద కాలంగా అసలు ప్లేఆఫ్స్ ముఖమే చూడలేదు. అలాంటి జట్టు ఈసారి లీగ్ దశను అగ్రస్థానంతో ముగించింది. సూపర్ ఫామ్‌లో ఉన్న ముంబయిని ఓడించి ఫైనల్లోనూ అడుగుపెట్టింది. తుది పోరులోనూ స్ఫూర్తిదాయక ప్రదర్శనతో టైటిల్‌కు అత్యంత చేరువగా వచ్చింది. కానీ స్వల్ప తేడాతో కప్పును కోల్పోయింది. పంజాబ్ ఇంత గొప్ప ప్రదర్శన చేయడంలో శ్రేయస్ అయ్యర్ పాత్ర అత్యంత కీలకం. పంజాబ్ కప్పు గెలవకపోయినా.. శ్రేయస్ సారథ్యంలో ఒక ఛాంపియన్ జట్టులాగే ఎదిగిందన్నది స్పష్టం. ఎన్నో ఏళ్ల నుంచి జట్టులో మార్పులు చేర్పులు చేస్తున్నా పెద్దగా ప్రభావం చూపలేకపోయిన పంజాబ్.. శ్రేయస్‌కు బాధ్యతలు అప్పగించడంతో ఊహించని స్థాయికి చేరుకుంది. ఈ సీజన్‌కు ముందు పంజాబ్ జట్టును చూస్తే ఓ మోస్తరుగా అనిపించిందంతే. శ్రేయస్ అయ్యర్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, మార్కస్ స్టాయినిస్, చాహల్, అర్ష్‌దీప్ సింగ్‌లను మినహాయిస్తే పేరున్న అంతర్జాతీయ స్టార్లు కనిపించలేదు. వీరిలోనూ మ్యాక్సీ, చాహల్ ఫామ్ అంత గొప్పగా లేదు. స్టాయినిస్ ఒకట్రెండు మ్యాచ్‌ల్లో మినహా మెరిసింది లేదు. అయినా పంజాబ్ నిలకడగా విజయాలు సాధించింది. బ్యాటింగ్‌లో తాను ముందుండి నడిపిస్తూ.. ఇంకా అంతర్జాతీయ క్రికెట్ ఆడని ప్రభ్‌సిమ్రన్, ప్రియాంశ్ ఆర్య, శశాంక్ సింగ్, నేహాల్ వధేరా, విజయ్ కుమార్ వైశాఖ్, హర్‌ప్రీత్ బ్రార్ లాంటి కుర్రాళ్లను సమర్థంగా ఉపయోగించుకుంటూ శ్రేయస్ జట్టును తిరుగులేని స్థితిలో నిలబెట్టాడు. ఈ సీజన్లో పంజాబ్ భారీ స్కోర్లు చేసి గెలవడమే కాదు.. ప్రత్యర్థి జట్లను స్వల్ప స్కోర్లకు కట్టడి చేసింది. కోల్‌కతాతో మ్యాచ్‌లో 111 పరుగులకే ఆలౌటైనా సరే.. ప్రత్యర్థిని 95 పరుగులకే కుప్పకూల్చి విజయం సాధించింది. ఇక్కడే శ్రేయస్ కెప్టెన్సీ పనితనం అర్థమవుతుంది. శ్రేయస్ మీద వేలంలో పంజాబ్ రూ.26.75 కోట్లు పెట్టినపుడు అంత ధరా అనుకున్నారంతా! కానీ ఆ రేటుకు మించిన ప్రదర్శనతో పంజాబ్ రాత మార్చేశాడు. దిల్లీకి కెప్టెన్ అయిన తొలి సీజన్లోనే ప్లేఆఫ్స్‌కు చేర్చడమే కాదు.. ఇంకో ఏడాది ఫైనల్‌కూ తీసుకెళ్లిన ఘనత శ్రేయస్ సొంతం. ఇక పదేళ్ల విరామం తర్వాత నిరుడు కోల్‌కతాకు కప్పు సాధించి పెట్టిందీ శ్రేయసే. అయినా ఆ రెండు జట్లలో అతడికి సరైన గౌరవం దక్కలేదు. ఆ జట్లను ఉత్తమ స్థితికి తీసుకెళ్లాక అతను బయటికి రావాల్సి వచ్చింది. దీంతో పంజాబ్ పగ్గాలందుకున్నాక తనేంటో చూపించాలన్న కసి అతడిలో స్పష్టంగా కనిపించింది. ఈ ఐపీఎల్‌లో కెప్టెన్‌గా శ్రేయస్ నైపుణ్యాలు చూశాక అతణ్ని భవిష్యత్ భారత కెప్టెన్‌గా అభివర్ణిస్తున్నారు. రోహిత్ తర్వాత వన్డే పగ్గాలు తనకే దక్కాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాక శ్రేయస్‌కు టెస్టు, టీ20 జట్లలోనూ చోటివ్వాలనే డిమాండ్లూ ఊపందుకున్నాయి. మూడేళ్ల ముందు వేలంలో అమ్ముడవని ఆటగాడు.. ఇప్పుడు ఓ జట్టుకు కెప్టెన్ అయి, తొలి సీజన్లోనే కప్పు సాధించిపెట్టడం అంటే సామాన్యమైన విషయం కాదు. ఈ అరుదైన ఘనతే సాధించాడు రజత్ పాటీదార్. అతను ఇంకేదైనా జట్టును విజేతగా నిలిపితే మరీ విశేషంగా అనిపించేది కాదేమో. కానీ తొలి టైటిల్ కోసం 18 ఏళ్లుగా నిరీక్షిస్తున్న బెంగళూరుకు టైటిల్ అందించడంతో దేశవ్యాప్తంగా అతడి పేరు మార్మోగిపోతోంది. కోహ్లి పదేళ్లకు పైగా శ్రమించినా సాధ్యం కానిది.. కుంబ్లే, ద్రవిడ్, డుప్లెసిస్ లాంటి మేటి ఆటగాళ్లు ప్రయత్నించి విఫలమైంది.. రజత్ కెప్టెన్సీ అందుకున్న తొలి ఏడాదే సాధించాడు. మూడేళ్ల ముందు రజత్ పరిస్థితి చూస్తే.. అతను ఇప్పుడిలా ఛాంపియన్ కెప్టెన్ అవుతాడనే ఊహ కూడా ఎవరికీ వచ్చి ఉండదు. 2022 వేలంలో అతను అమ్ముడవనే లేదు. అంతకుముందు సీజన్లో రజత్.. ఆర్సీబీకి ఆడాడు. తర్వాతి సీజన్‌కు అతణ్ని అట్టిపెట్టుకుంటామన్న ఫ్రాంఛైజీ.. వేలంలో కూడా కొనుక్కోలేదు. వేరే ఆటగాడు గాయపడితే ప్రత్యామ్నాయం కింద అతణ్ని ఎంచుకుంది. అయితే ఆ సమయంలో ఆ జట్టులోకి వెళ్లొద్దని అనుకున్నాడట పాటీదార్. కానీ తర్వాత మనసు మార్చుకున్నాడు. సీజన్ మధ్యలో వచ్చి మెరుపు సెంచరీ బాదడంతో ఆర్సీబీ అతడి విలువను గుర్తించింది. తర్వాతి సీజన్లో గాయం వల్ల ఆడలేకపోయినా.. గత ఏడాది అతణ్ని అట్టిపెట్టుకుంది. ఈసారి ఏకంగా కెప్టెన్‌ను చేసింది. రజత్‌ను కెప్టెన్‌గా ప్రకటించినపుడు ఆర్సీబీ అభిమానుల్లో అసంతృప్తి వ్యక్తమైంది. తనకా స్థాయి లేదన్నట్లు మాట్లాడారు. రజత్‌లో కూడా రెండేళ్ల ముందు కెప్టెన్సీ చేయగలన్న నమ్మకమే లేదట. దీని గురించి మధ్యప్రదేశ్ కోచ్ చంద్రకాంత్ పండిట్ ఒక సందర్భంలో చెప్పాడు. "రెండేళ్ల క్రితం మధ్యప్రదేశ్ సారథ్యం తీసుకోవాల్సిందిగా పాటీదార్‌ని కోరాను. కానీ అప్పుడు అతడు చాలా బెరుకుగా కనిపించాడు. పొదుపుగా మాట్లాడుతూ ఎక్కువగా ఎవరితోనూ కలవని కెప్టెన్సీ చేయగల సత్తా తనకుందని అనుకొని ఉండడు. గతేడాది తానే స్వయంగా వచ్చి సారథ్యం చేస్తా అని చెప్పాడు. ముస్తాక్ అలీ టోర్నీలో జట్టును ఫైనల్ చేర్చాడు" అని పండిట్ తెలిపాడు. ఆ అనుభవంతోనే పాటీదార్.. ఆర్సీబీని నడిపించగలనన్న నమ్మకం వచ్చి ఉండొచ్చు. కోట్లమంది అనుసరించే, భారీ అంచనాలుండే జట్టుకు సారథ్యం వహించే బాధ్యతను తీసుకోవడమే పెద్ద సవాల్. ఆ సవాలును స్వీకరించి జట్టు రాతను మార్చేశాడు పాటీదార్. అంచనాల ఒత్తిడి వల్లో ఏమో కోహ్లి సహా గత కెప్టెన్లందరూ తీవ్ర ఒత్తిడికి గురయ్యేవారు.

## సుశాంత్ ఈసారి గట్టి ప్లానింగ్ తోనే..!



మేఘా శుక్లా: ది ఎరా ఆఫ్ ఆషికీ లైవ్స్ ఆన్





ప్రియాంక KD తన స్వంత రన్‌వేపై రాకింగ్ చేస్తోంది

అక్కినేని ఫ్యామిలీ హీరో సుశాంత్ 2021 లో ఇచ్చట వాహనములు నిలుపరాదు సినిమా చేశాడు. ఆ తర్వాత గ్యాప్ తీసుకున్నాడు. అల వైకుంఠపురములో, భోళా శంకర్, రావణాసుర సినిమాల్లో నటించినా పెద్దగా ఉపయోగం లేకుండా పోయింది. అందుకే ఆఫ్టర్ షార్ట్ గ్యాప్ మళ్లీ తన సోలో సినిమాతోనే రాబోతున్నాడు సుశాంత్. ఈసారి యాక్షన్ ఎంటర్టైనర్ గా రాబోతున్నాడని తెలుస్తుంది. సుశాంత్ 10వ సినిమా అప్డేట్ అతని బర్త్ డే మార్చి 18న వచ్చింది. ఈ సినిమాను పృధ్వీరాజ్ చిట్టేటి డైరెక్ట్ చేస్తున్నాడు. సంజీవని క్రియేషన్స్ బ్యానర్ లో వరుణ్ కుమార్, రాజ్ కుమార్ కలిసి ఈ మూవీ నిర్మిస్తున్నారు. మిస్టరీ థ్రిల్లర్ బ్యాక్ డ్రాప్ లో సుశాంత్ 10వ సినిమా ఉంటుందని తెలుస్తుంది. సుశాంత్ ఈ ప్రాజెక్ట్ విషయంలో చాలా గట్టి ప్లానింగ్ లోనే ఉన్నాడని తెలుస్తుంది. ఫస్ట్ లుక్ తోనే సుశాంత్ అదరగొట్టాడు. హీరోగా కాస్త గ్యాప్ ఇచ్చి స్టార్ సినిమాల్లో వెయిట్ ఉన్న పాత్రలు వేస్తూ వచ్చాడు. ఐతే అవేవి సుశాంత్ కి సంతృప్తిని ఇవ్వలేదు. ఆడియన్స్ కూడా సుశాంత్ అలా సైడ్ రోల్స్ చేయడం ఇబ్బందికరంగా ఫీల్ అయ్యారు. అందుకే ఈసారి పర్ఫెక్ట్ ప్లానింగ్ తో అదిరిపోయే కథతో వస్తున్నాడని తెలుస్తుంది. సుశాంత్ స్క్రిప్ట్ దశలోనే సినిమా గురించి చాలా ఎగ్జైట్ అవుతున్నాడని తెలుస్తుంది. అందుకే మార్కెట్ పెద్దగా లేకపోయినా ఈసారి బాక్సాఫీస్ దగ్గర తన సత్తా చాటాలని చూస్తున్నాడు. అక్కినేని హీరోల్లో సుశాంత్ కూడా తన ప్రయత్నాలు తను చేస్తున్నాడు. అప్పట్లో హీరోగా వరుస సినిమాలు చేసిన సుశాంత్ కాస్త గ్యాప్ ఇచ్చాడు. ఐతే సినిమాలు చేస్తుంటేనే ఏదో ఒక మంచి కథ పడి సక్సెస్ వస్తుంది. అందుకే సుశాంత్ కూడా అదే పంథా కొనసాగించాలని చూస్తున్నాడు. సుశాంత్ 10వ సినిమా ఎలా ఉంటుంది. అసలు ఎలాంటి సినిమాతో వస్తున్నాడు అన్నది ఆ ప్రాజెక్ట్ నుంచి ఏదైనా టీజర్ వస్తే తెలుస్తుంది. యువ దర్శకుడిగా పృథ్వీరాజ్ ఈసారి సుశాంత్ కి సూపర్ హిట్ ఇచ్చి తీరుతా అనే కాన్ఫిడెంట్ గా ఉన్నాడట. మరి ఈ కాంబో ప్రేక్షకులను ఎంతమేరకు మెప్పిస్తుందో చూడాలి. సుశాంత్ కూడా మళ్లీ హిట్ ట్రాక్ ఎక్కి వరుస సినిమాలు చేయాలని ఉత్సాహపడుతున్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com